

పెండింగ్ లేకుండా భూసేకరణ పూర్తి చేయాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

కడప కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారుల అభివృద్ధిలో భాగంగా జిల్లాలో చేపడుతున్న భూ సేకరణ, అటవీ, పర్యావరణ అభ్యంతరాల క్లియరెన్స్ పెండింగ్ లేకుండా గడువులోగా పూర్తిచేయాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఆదేశించారు. జాతీయ రహదారుల అభివృద్ధి, విస్తరణ పనులకు సంబంధించి భూ సేకరణ తదితర అంశాలపై మంగళవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్లో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలో రవాణా వ్యవస్థను మరింత సులభతరం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాయన్నారు. అందులో భాగంగా బెంగళూరు-కడప-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి 1,094 హెక్టార్ల భూసేకరణ చేస్తున్నామన్నారు. జిల్లా పరిధిలో భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇస్తున్నామన్నారు. జాతీయ రహదారులు, రైల్వేలైన్ల నిర్మాణం, వాటి అభివృద్ధికి అదనంగా చేపడుతున్న భూసేకరణ పనులు వేగవంతం చేస్తున్నామన్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి నిర్ణీత గడువులోగా పెండింగ్ పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారుల అభివృద్ధి పనులు, భూసేకరణ పనులకు సంబంధించి అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీవో జాన్‌ఇర్విన్, ఎన్‌హెచ్ఏఐ ఎస్టీసీ వెంకటపతి, పీడీ అశోక్ కుమార్, డిప్యూటీ మేనేజర్లు వేణుగోపాల్, సుదర్శన్ కుమార్, ఆర్‌అండ్‌బి నేషనల్ హైవే ఈఈ విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గండికోటకు మహర్దశ

● పెన్నాలోయ గురించి కేంద్ర మంత్రి దృష్టికి


గండికోట వద్ద సహజ సిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయ

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటకు మహర్దశ పట్టనుంది. ఇక్కడ సహజ సిద్ధంగా ఏర్పడిన పెన్నాలోయను ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా అభివృద్ధి చేయాలని డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కేంద్ర పర్యాటక శాఖామంత్రి గజేంద్ర సింగ్‌ను కోరారు. మంగళవారం ఢిల్లీలో ఆయన కేంద్రమంత్రితో భేటీ అయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగంలో ప్రధా నంగా 7 ప్రాజెక్టులపై ఆయన మంత్రి ముందు ప్రతిపాదనలు పెట్టారు. అలాగే రాష్ట్రంలో టూరిజం వర్సిటీ నెలకొల్పాలని పవన్ కోరారు. దీనికి కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. కడప జిల్లాలోని గండి కోటను ఇండియన్ గ్రాండ్ క్యానియన్‌గా అభివృద్ధి చేసేందుకు అవకాశం ఉందని ఆ ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. దీంతో గండికోట అభివృద్ధికి మార్గం సుగమం అయిందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

వైసీపీలో కలవరం

● సోషల్ మీడియాలో బూతు కంటెంట్ పోస్టులపై విచారణ ముమ్మరం
● వర్రా రవీంద్రరెడ్డి వాంగ్మూలంతో కూపీ లాగుతున్న పోలీసులు
● సోషల్ మీడియా అకౌంట్లు డీయాక్టివ్
● ఇప్పటికే పలువురు ఊరొదిలి జంప్
● పట్టించుకోని వైసీపీ నాయకత్వం
● పార్టీ నేతల తీరుపై వైసీపీ సోషల్ మీడియా గరంగరం



(కడప-ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ఆవు చేలో మేస్తే.. దూడ గట్టున మేస్తుందా అన్నచందంగా జరిగింది. తప్పు ఎవరు చేసినా వారిని మందలించాలి. అలా కాకుండా జగన్ అండ్ కో వ్యవహరించింది. ప్రత్యర్థి పార్టీ నేతలను, వారి కుటుంబ సభ్యులను ఎవరు ఎక్కువ తిడితే.ఎవరు ఎక్కువ అసభ్యంగా పోస్టులు పెడితే పార్టీలో అంత ఎక్కువ మైలేజీ ఇస్తూ వచ్చింది. సాక్షాత్తు అప్పటి సీఎం జగన్ మొదలు.. మంత్రులు, ఎమ్మెల్యేలు నోటికి అడ్డు అదుపు లేదు. వాళ్లను చూసుకుని వారు ఇచ్చే చిల్లరకు ఆశపడి వైసీపీ సోషల్ మీడియాలో నీచాతినీచంగా పోస్టులు పెట్టారు. అయితే ఆలస్యంగా అయినా కూటమి ప్రభుత్వం సోషల్ మీడియా ఉగ్రవాదాన్ని అణచివేయాలని డిసైడ్ అయింది. వైసీపీ సోషల్ మీడియాలోనే మోస్ట్ వాంటెడ్‌గా ముద్రపడ్డ వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేయడం... విచారణలో ఆయన వెల్లడించిన సమాచారం కలకలం రేపింది. సుమారు 50 మందికి పైగా బూతు కంటెంట్ పోస్టులను షేర్ చేసిన వారిని పోలీసులు గుర్తించారు. వీరందరికీ పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. ఈ కేసు దర్యాప్తును పోలీసులు ముమ్మరం చేస్తున్నారు. ఇది ఇప్పుడు వైసీపీ సోషల్ మీడియాలో కలకలం రేపుతోంది.

విచారణ వేగవంతం

వైసీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ వర్రా రవీంద్రరెడ్డిపై పులివెందుల పోలీసులు ఈ నెల 8వ తేదీన కేసు నమోదు చేశారు. సింహాద్రిపురానికి చెందిన హరి అనే వ్యక్తి ఫిర్యాదుతో వర్రాతో పాటు వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డి, జగన్‌కు వరుసకు మేనల్లుడు అర్జున్‌రెడ్డితో పాటు మరికొందరిపై ఎస్సీ ఎస్టీ యాక్టు కింద కేసు నమోదైంది. దీంతో పాటు ఐటీ, బీఎన్ఎస్ సెక్షన్లు కూడా చేర్చారు. వర్రా రవీంద్రరెడ్డిని అరెస్టు చేయగా, ప్రస్తుతం సెంట్రల్ జైలులో రిమాండులో ఉన్నారు. సోషల్ మీడియాలో బూతులు, అసభ్య పోస్టులు పెట్టిన సుమారు 50 మందిని పోలీసులు గుర్తించారు. నెల్లూరు, విజయవాడ, ఇతర ప్రాంతాల్లో ఉన్న వైసీపీ సోషల్ మీడియా వారికి పోలీసులు 41ఏ నోటీసులు జారీ చేశారు. మంగళవారం కడపకు చెందిన సునీతారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డిలను కడప సైబర్ క్రైం పోలీసులు విచారించారు. రెండు రోజులుగా ఇక్కడ విచారణ జరుగుతోంది. ఈ బూతు కంటెంట్ ఎవరు ఇచ్చారు.. దీని వెనుక ఎవరు ఉన్నారు అనేదానిపై లోతుగా విచారిస్తున్నారు. కొద్దిరోజులుగా సైలెంట్‌గా ఉన్న ఈ కేసును ఇప్పుడు స్పీడప్ చేశారు. సజ్జల భార్గవరెడ్డిని సోమవారం విచారణకు రావాలంటూ నోటీసులు ఇచ్చారు. అయితే ఆయన విచారణకు హాజరు కాలేదు. వారం రోజులు గడువు కావాలంటూ పులివెందుల డీఎస్పీకి సమాచారం ఇచ్చారు. ఏ-3గా ఉన్న జగన్ మేనల్లుడు అర్జున్‌రెడ్డి కూడా విచారణకు హాజరు కాలేదు. వీరికి మరోసారి నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. ఇక నెల్లూరు జిల్లాకు చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి, విజయవాడకు చెందిన ఆనం నరేంద్ర రెడ్డిలను పోలీసులు రెండురోజులపాటు విచారించారు. ఉమ్మడి జిల్లాలో వర్రా బ్యాచ్‌పై నమోదైన కేసులన్నింటినీ పులివెందులకే బదిలీ చేశారు. దీంతో డీఎస్పీ మురళీనాయక్ రెండు రోజులుగా కడప సైబర్ క్రైంలో నిందితులను విచారిస్తున్నారు. మిగతా వారందరికీ నోటీసులు జారీ చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఇతర ప్రాంతాలకు పంపిస్తున్నారు.

ఎరక్కపోయి ఇరుక్కున్నాం

జగన్‌పై అభిమానంతో కొందరు.. కులపిచ్చితో మరి కొందరు.. వారు ఇచ్చే డబ్బులకు ఆశపడి ఇంకొందరు నీచాతినీచంగా సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెట్టారు. వైసీపీ అధికారం అండ చూసుకుని మళ్లీ జగనే సీఎం అవుతారనే ధీమాతో కనీసం వయసుతో నిమిత్తం లేకుండా కొందరు పోస్టులు పెట్టారు. ఇప్పుడు వారిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. విచారణ కోసం 41ఏ నోటీసు జారీ చేసి విచారణకు రావాలంటున్నారు. ఈ దెబ్బతో వైసీపీ సోషల్ మీడియాలో అలజడి రేగింది. నిన్నటిదాకా తోపు తొక్క అంటూ సోషల్ మీడియాలో రెచ్చిపోయిన బ్యాచ్ అంతా ప్రభుత్వ చర్యలతో ఖంగుతింది. కొందరు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలో అకౌంటు ఖాళీ చేసి గప్‌చుప్‌గా ఉన్నారు. ఇక కేసు నమోదై 41ఏ నోటీసు అందుకున్న వారి పరిస్థితి ఘోరంగా ఉంది.. వారిని వైసీపీ పూర్తిగా వదలేసింది. కేసుల భయంతో వైసీపీ కేడరు అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. "జగన్‌పై అభిమానంతో పార్టీ కోసం గుడ్డలు చింపుకుని మరీ కష్టపడ్డాం.. ప్రత్యర్థి పార్టీ నేతలను టార్గెట్‌గా పోస్టులు పెట్టాం.. ఇప్పుడు మాపై కేసులు పెడుతున్నారు. అయితే ఒక్క నాయకుడు కూడా పట్టించుకోవడం లేదు. ఎరక్కపోయి ఇరుక్కున్నాం" అంటూ వీరిలో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ కుటుంబాన్ని పట్టించుకోవడంలేదని, కనీసం బెయిలు వచ్చేందుకు సహాయం చేయడంలేదని అంటున్నారు. అరెస్టు భయంతో కొందరు ఊరువదిలి వెళ్లిపోయారు. వారి కుటుంబాలను ఆదుకునేవారే లేరంటూ ఓ వైసీపీ యువనేత వ్యాఖ్యానించారు. తెలిసిచేసినా తెలియకచేసినా తప్పు తప్పే అంటారు. మరి వైసీపీ సోషల్ మీడియా బ్యాచ్ తెలిసే తప్పులు చేసింది. ఇప్పుడు ఫలితం అనుభవించక తప్పదని కొందరు ఆ పార్టీవారే వ్యాఖ్యానిస్తున్నారు.

రెండోరోజూ కొనసాగిన విచారణ

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో కూటమి నేతలపై అసభ్యకర పోస్టులు చేసిన వారి విచారణ రెండరోజైన మంగళవారమూ కొనసాగింది. వైసీపీ సోషల్ మీడియా కడపకు చెందిన కన్వీనర్లను కడప సైబర్ పోలీసు స్టేషన్‌లో విచారించారు. ముందుగా ఆనం నరేంద్రరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డితో పాటు కడపకు చెందిన సునీతారెడ్డి, నిరంజన్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డిలను విచారించారు. అయితే వారికి సహకరించిన వారు, ఆర్థిక సహాయంపై ఆరా తీసినట్లు తెలుస్తోంది. పులివెందుల డీఎస్పీ మురళీనాయక్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సీఐ మధుమల్లేశ్‌రెడ్డి సిబ్బందితో వారిని విచారించిన అనంతరం అన్నమయ్య జిల్లాలోని ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఎదుట హాజరుపరిచినట్లు తెలుస్తోంది.


పోలీసుల విచారణకు హాజరైన వైసీపీ సోషల్ మీడియా నిందితులు

రాజ్యాంగ స్ఫూర్తిని కొనసాగించాలి

● కలెక్టర్ చెరుకూరి శ్రీధర్



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, జేసీ అదితిసింగ్

కడపకలెక్టరేట్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ స్ఫూర్తిని, రాజ్యాంగ భావనను ప్రతి పౌరుడూ కొనసాగించాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ కోరారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సభాభవన్‌లో 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టరేట్ ప్రాంగణంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్, జేసీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలందరికీ 75 వ రాజ్యాంగ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. బ్రిటీష్ పాలనలో ఆనాడు ఎన్నో ఒడిదుడుకులు తట్టుకుని మనదేశ పరిస్థితులకు అనుగుణంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. ఇందులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ముఖ్య భూమిక పోషించారన్నారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధి, అభ్యున్నతిని కాంక్షిస్తూ రచించిన మనదేశ రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యుత్తమంగా నిలిచిందన్నారు. జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అతిపెద్ద రాజ్యాగం మనదేనని దీన్ని రూపొందించడానికి మొత్తం 11 నెలల 18 రోజులు పట్టిందన్నారు. 1949 నవంబరు 26వ తేదీన ఆమోదం పొంది 1950 నుంచి అమలులోకి వచ్చిందన్నారు. రాజ్యాంగ విలువలను ప్రతిపౌరుడు పాటించి, దేశ అభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. అనంతరం రాజ్యాంగ ప్రవేశికలోని న్యాయ చట్టాల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విశ్వేశ్వర నాయుడు, ఆర్డీవో జాన్‌ఇర్విన్, కడప కమిషనర్ మనోజ్ రెడ్డి, అధికారులు నాగేశ్వరరావు, ఆనంద్‌నాయక్, వేణుగోపాల్‌రెడ్డి, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సర్వేయర్‌పై కేసు నమోదు

ప్రొద్దుటూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మున్సిపాలిటీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్‌లో టౌన్ సర్వేయర్‌గా పనిచేస్తున్న జీఎల్ఎన్ రవికిశోర్ నకిలీ చలానాలతో పాటు మున్సిపల్ కమిషనర్ సంతకం ఫోర్జరీ చేయడంపై వన్‌టౌన్ సీఐ రామకృష్ణారెడ్డి కేసు నమోదు చేశారు. సర్వేయర్ రవికిశోర్‌పై వచ్చిన ఆరోపణలు సాక్ష్యాలతో విచారణలో రుజువు అయినందున సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్ అండ్ సెటిల్‌మెంట్ డిపార్ట్‌మెంట్‌కు ఆయనను సరెండర్ చేయడంతో పాటు సస్పెన్షన్‌కు ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున సిఫారసు చేశారు.

కాశీవిశ్వేశ్వరాలయంపై విదేశీ వ్యక్తుల శిల్పాలు..!



చెన్నూరు శివాలపల్లెలోని కాశీవిశ్వేశ్వరుడి ఆలయం, గాలిగోపురంపై విదేశీ వస్త్రధారణతో ఉన్న శిల్పాలు (వృత్తంలో)

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు మండలంలోని శివాలపల్లెలో పెన్నానది ఒడ్డున ఉన్న కాశీవిశ్వేశ్వర ఆలయ గోపురంపై విదేశీ వ్యక్తుల శిల్పాలు ఉండడం ఆశ్చర్యకరమని రచయిత, చరిత్ర పరిశోధకులు బొమ్మిశెట్టి రమేశ్ అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి శిల్పాలున్న ఏకైక గాలిగోపురం ఇదేనని అన్నారు. మంగళవారం ఆయన కాశీవిశ్వేశ్వర ఆలయ గోపురంపై ఉన్న శిల్పాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఈ ఆలయం చాలా పురాతనమైనదని దీనిపై విదేశీ వస్త్రధారణ వ్యక్తుల కుడ్యశిల్పాలు ఉండడం అబ్బురపరిచే విషయమన్నారు. మూడంతస్తుల్లో ఉన్న ఆలయ గాలిగోపురం ముందు భాగంలో మొదటి అంతస్తులోని పైభాగంలో విదేశీ వస్త్రధారణతో ప్రస్ఫుటంగా కొన్ని శిల్పాలు ఉన్నాయన్నారు. వీటిపై మరింత పరిశోధన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఈ శిల్పాల ఫొటోలను స్తపతి ఈమని శివనాగిరెడ్డికి పంపగా.. అప్పటి కడప కలెక్టర్ థామస్ మన్రో ఆదేశాల మేరకు ఈ కాశీవిశ్వేశ్వర దేవాలయ గాలిగోపురాన్ని శిథిలావస్థ నుంచి బాగు చేసి ఉంటారని ఆ సమయంలో ఈ శిల్పాలు ఏర్పాటు చేసి ఉండే అవకాశం ఉందని తెలిపారన్నారు.

అనాథలు.. అభాగ్యులకు
ఆసరా ఏదీ ?
● నామమాత్రంగా నైట్‌షెల్టర్లు
● పట్టించుకోని ప్రభుత్వాలు
7

విండ్ పవర్ ప్రాజెక్టులకు
గ్రీన్ సిగ్నల్
● వీరబల్లిలో 1800 మెగావాట్ల ప్రాజెక్టు
6
● కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగావాట్లతో మరో ప్రాజెక్టు

పేరుకే జాతీయ రహదారి.. రోడ్డంతా గుంతలే..!

● ఐదేళ్లుగా మరమ్మతులకు నోచుకోని రోడ్డు
● జాతీయ రహదారిగా మారినా దీనస్థితిలోనే
● ఇదీ ముద్దనూరు-పులివెందుల రహదారి పరిస్థితి


ఇనగలూరు-సైదాపురం మధ్య జాతీయ రహదారిలో ఏర్పడిన పెద్ద గొయ్యి

తొండూరు-ఇనగలూరు మధ్యలో దెబ్బతిన్న రోడ్డు



పేరు గొప్ప ఊరు దిబ్బ అనేలా నేషనల్ హైవే మారింది. ముద్దనూరు-పులివెందుల మధ్య ఉన్న జాతీయ రహదారి ఐదేళ్లుగా దయనీయస్థితిలో ఉంది. అడుగడుగునా గుంతలతో దర్శనమిస్తోంది. ఈ రహదారి అంటేనే జనం హడలిపోతున్నారు. ఐదేళ్లు జగన్ సీఎంగా ఉన్నారు. ఆయన హయాంలోనే 2020లో కేంద్ర ప్రభుత్వం దీనిని రూ.1080 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా మారుస్తామని ప్రకటించింది. ఇది కార్యరూపం దాల్చిఉంటే ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా సత్యసాయి జిల్లాకు రాకపోకలు సాగించడానికి బాగా అనుకూలంగా ఉండేది. కానీ ఇప్పటికీ ఇది టెండర్ల దశ దాటక పోవడం విశేషం. దీంతో ఇది జాతీయరహదారి అయినా.. పెద్దపెద్ద గోతులతో వాహనదారులకు నరకం చూపిస్తోంది.

పులివెందుల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ముద్దనూరు-పులివెందుల జాతీయ రహదారి అధ్వాన్నంగా ఉంది. ఈ రోడ్డు 2004లో వేశారు. అప్పటి నుంచి ఈ రోడ్డును పట్టించుకోలేదు. అప్పుడప్పుడు గుంతలకు ప్యాచ్‌లు వేస్తూ కాలం గడుపుతున్నారు. దీనిని ప్రధాన కారణం ఈ రోడ్డు ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి నేషనల్ హైవేగా మారడమే. ముద్దనూరు-బి.కొత్తపల్లె వరకు నాలుగు వరుసల రహదారి వేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో అటు ఎన్‌హెచ్ వాళ్లు, ఇటు ఆర్‌అండ్‌బీ వాళ్లు రోడ్డును పట్టించుకోవడం మానేశారు. రోడ్డులో మీటర్ల మేర గుంత పడితే కానీ అధికారులు స్పందించడం లేదు. అది కూడా కాస్తోకూస్తో ప్యాచ్‌లు వేసి చేతులు దులుపుకొంటున్నారు. ప్రధానంగా పులివెందుల-ముద్దనూరు రోడ్డు విషయానికొస్తే మల్లేల ఘాట్‌రోడ్డు అవతలివైపు నుంచి తొండూరు మండలంలోని కృష్ణంగారిపల్లె వరకు ఈ రోడ్డులో అడుగడుగునా గుంతలు ఉన్నాయి. ఇక పులివెందుల నుంచి బి.కొత్తపల్లె రోడ్డు విషయానికొస్తే పులివెందుల రింగురోడ్డు దాటినప్పటి నుంచి తాండా తదితర గ్రామాల వరకు గుంతలతో నిండి ఉంది.

నాలుగు వరుసలుగా మారడమే శాపమా

ముద్దనూరు నుంచి ఉమ్మడి అనంతపురం జిల్లా బి.కొత్తపల్లె వరకు నాలుగు వరుసల రహదారి నిర్మించేందుకు 2020లో కేంద్ర ప్రభుత్వం చర్యలు నిర్ణయించింది. ఈ మేరకు రూ.1080కోట్లతో 58.5 కిలోమీటర్ల మేర నాలుగు వరుసల జాతీయ రహదారి నిర్మిస్తామని ప్రకటించింది. దీంతో ఈ రహదారి రూపురేఖలే మారిపోతాయని అందరూ భావించారు. కానీ భూసేకరణ, టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడంతో రోడ్డు దుస్థితి దయనీయంగా ఉంది. నాలుగు వరుసల రహదారి మంజూరు కావడంతో ఉన్న రోడ్డును పూర్తిగా తొలగించి కొత్తరోడ్డు వేయాల్సి ఉంది. దీని కారణంగా కేవలం గుంతలకు ప్యాచ్‌లతోనే సరిపెడుతున్నారు. ముద్దనూరు నుంచి బి.కొత్తపల్లె వరకు ఇదే తీరుగా ఉంది. దీంతో రోజురోజుకూ గుంతలు పెరుగుతున్నాయే కానీ తగ్గడం లేదు. ఈ విషయాన్ని ఓ అధికారి దృష్టికి తీసుకెళ్లగా.. వర్షాలు పడకముందు ప్యాచ్‌లు వేశామని అన్నారు. తర్వాత వర్షాలు తగ్గినప్పటి నుంచి అక్కడక్కడ గుంతలకు ప్యాచ్‌లు వేస్తున్నామని చెప్పారు.

టెండర్ల ప్రక్రియలో..

ముద్దనూరు-బి.కొత్తపల్లె జాతీయ రహదారికి సంబంధించి 58.5 కి.మీ మేర రూ.1080 కోట్లతో పనులు చేసేందుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. దాదాపు 19 సంస్థలు టెండర్లు వేసినట్లు సమాచారం. ఈ టెండర్ల ప్రక్రియ సజావుగా సాగితే పనులు ప్రారంభం కావడానికి నాలుగు నుంచి ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. భూసేకరణ పనులు పూర్తయినప్పటికీ డబ్బుల చెల్లింపులో ఆలస్యం అవుతోంది. పనులు ప్రారంభించాలంటే భూసేకరణకు సంబంధిత వ్యక్తులకు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించాల్సి ఉంది. లేదంటే భూనిర్వాసితుల నుంచి నిరసనలు వెల్లువెత్తే అవకాశాలు లేకపోలేదు. ఇవన్నీ పక్కనపెడితే ప్రస్తుతం రోడ్డును కొంతమేర అయినా బాగుచేస్తే వాహనాలకు ఇబ్బంది లేకుండా ఉంటుందని పలువురు అంటున్నారు. ఏదేమైనా ముద్దనూరు-పులివెందుల రోడ్డు జాతీయ రహదారిగా మారినా అధ్వాన్న స్థితిలోనే ఉందన్నది వాస్తవం.


ఇనగలూరు సమీపంలో ఉన్న మరో గొయ్యి

కుష్ఠువ్యాధిని జయించారు..

- యాచక వృత్తి మానేసి..
- ఆవులు, మేకల పెంపకం...
- జ్యోతి కాలనీ విజయగాథ




పచ్చని చెట్ల మధ్య ఉన్న జ్యోతి కాలనీ

రైల్వేకోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆ కాలనీ వాసులు తీవ్రమైన కుష్ఠువ్యాధితో బాధపడేవారు. ఆదరించేవారు లేక యాచించేవారు. కుష్ఠు వ్యాధి అంటేనే అప్పట్లో భయంతో ఎవరూ దగ్గరకు వచ్చేవారు కాదు. ఎన్నో కష్టాలు, నష్టాలు అనుభవించారు. పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతున్న వారిలో చైతన్యం వచ్చింది. ఎలాగైనా జీవనం మెరుగుపరచుకోవాలని అడవిలో కట్టెలు కొట్టుకుని వచ్చి వాటిని అమ్ముకునేవారు. కనిపించిన వారిని జీవనోపాధి మెరుగుకోసం సాయం చేయమని అర్థించారు. తమ భవిష్యత్తు కోసం బాటలు వేయాలని, కాపాడాలని ప్రజాప్రతినిధులకు విన్నపాలు చేసుకున్నారు. అనేకమంది సాయం అందించడంతో కుష్ఠు వ్యాధిని జయించి.. కష్టాల నుంచి గట్టెక్కి తమ కాలనీని ఆదర్శ కాలనీగా మార్చుకున్నారు.

ఎక్కడెక్కడి నుంచో వచ్చిన వారందరూ కుష్ఠువ్యాధితో రైల్వేకోడూరులో యాచిస్తూ జీవనం గడిపేవారు. వారికి షెల్టర్ లేక రైల్వేస్టేషన్, రోడ్లపైనే పడుకుంటూ గడిపేవారు. ఈ నేపథ్యంలో రైల్వేకోడూరుకు 16 కిలోమీటర్ల దూరంలో తిరుపతికి వెళ్లే మార్గంలో 1972లో జ్యోతికాలనీ అని నామకరణం చేసుకుని చిన్నపాటి గుడిసెలు వేసుకుని అక్కడే నివసించడం మొదలుపెట్టారు. కుష్ఠువ్యాధితో బాధపడుతూ పిల్లలను చదివించుకోలేక ఇబ్బందులు పడుతుండటంతో ఎల్కా అమెరికన్ లూథరన్ సంస్థ 16 మంది పిల్లలను రేణిగుంట, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్న పాఠశాలల్లో చేర్పించి చదివించింది. అప్పటి రాజంపేట సబ్ కలెక్టర్ బాబురాం తన కార్యాలయంలో కానుకల డబ్బాను ఏర్పాటు చేసి అందులో వచ్చిన డబ్బులతో గోధుమలు, బియ్యం తదితరాలను ఇచ్చేవారు. కుష్ఠువ్యాధిగ్రస్తులుగా ఉన్న కాలనీ వాసులు తమకు వ్యవసాయ భూమి కావాలని అభ్యర్థించారు. దివంగత టీడీపీ నేత, నెడ్‌క్యాప్ ఛైర్మన్ కట్టా నారాయణయ్యనాయుడు సమితి ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో జ్యోతికాలనీ వాసుల కష్టాలను తెలుసుకుని దూలాల ఇళ్లను మంజూరు చేశారు. దివంగత ముఖ్యమంత్రి టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు 1984లో తిరుమలకు వెళ్లి కడప మార్గంలో వెళుతుండగా జ్యోతికాలనీ వాసులు అడ్డుకుని వారి బాధలు చెప్పుకున్నారు. దీంతో వీరికి 97 ఎకరాల వ్యవసాయ భూమిని కేటాయించారు. అప్పటి కలెక్టర్ అమితాబ్ భట్టాచార్య జ్యోతికాలనీ వాసులకు ఒక్కొక్కరికి 1.50 ఎకరాల వ్యవసాయ భూమిని ఇచ్చారు. రాజంపేట ఆర్డీవోగా వెంకట్రామయ్య ఉన్న సమయంలో 86 శాశ్వత గృహాలు మంజూరు చేశారు. కలెక్టర్ చల్లప్ప ఉన్న సమయంలో జ్యోతి కాలనీకి రిలీఫ్ అండ్ రిహ్యాబిలిటేషన్ కింద సొసైటీ ఏర్పాటు చేయించి ఒక్కొక్క గృహానికి అప్పట్లో రూ.6 వేలు మంజూరు చేశారు. జ్యోతి కాలనీలో 102 కుటుంబాలు ఉన్నాయి. వ్యవసాయ భూముల్లో ఐడీసీ ద్వారా బోర్లు వేయించారు.

కాలనీవాసులు హౌసింగ్ శాఖకు డబ్బులు కట్టే స్థితిలో లేనందున రైల్వేకోడూరు వీధుల్లో తిరిగి విరాళాలు సేకరించి హౌసింగ్ శాఖకు చెల్లించారు. వ్యవసాయశాఖ ద్వారా ఉచితంగా వేరుశనగ విత్తనాలు తీసుకుని సాగు మొదలు పెట్టారు. పంట చేతికి బాగా వచ్చింది. కాలనీ వాసులకు చేతులు, కాళ్లు సక్రమంగా లేని కారణంగా మామిడి తోటల పెంపకం కావాలని పోరాటం మొదలు పెట్టారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రిన్సిపల్ కార్యదర్శిని కలసి విన్నపాలు చేసుకున్నారు. ఆయన ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేయడంతో మామిడి మొక్కల పెంపకం చేపట్టారు. తోటలు బాగా అభివృద్ధి చెందాయి. తర్వాత అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జ్యోతికాలనీకి రోడ్లు, వీధి లైట్లు, ప్రభుత్వ పాఠశాల, మినీ అంగన్వాడీ స్కూలు, ఓవర్‌హెడ్ ట్యాంకు, కమ్యూనిటీ హాలు మంజూరయ్యాయి. అప్పట్లో పాఠశాలల డైరెక్టర్‌గా ఉన్న ఐఏఎస్ అధికారి సుబ్రమణ్యం జ్యోతికాలనీకి సాయం అందించారు. పిల్లలు బాగా చదువుకుని దేశంలోని ప్రధాన నగరాలతో పాటు అమెరికా తదితర దేశాల్లో స్థిరపడ్డారు. కాలనీలోని చాలామంది యువకులు ట్రాక్టర్లు, అరటికాయల లోడు వెళ్లే వ్యాన్లు తదితర వాటిని తీసుకుని జీవనోపాధి పొందుతున్నారు. పాడి పరిశ్రమను పెట్టుకున్నారు. ప్రస్తుతం ఊరిలో 65 ఆవులు ఉన్నాయి. సిల్ప్ సంస్థ ద్వారా రూ.9 లక్షలు తీసుకుని స్వల్ప వడ్డీతో ఆవులను పట్టుకున్నారు. ఈ గ్రామంలో 6 స్వయం సహాయక బృందాలు ఉన్నాయి. దీంతో దినదినాభివృద్ధి చెందడంతో భిక్షాటన మానేశారు. జబ్బును పూర్తి స్థాయిలో నయం చేసుకున్నారు. ఇందుకు వైద్య, ఆరోగ్య శాఖ కూడా సహకరించింది. ఇప్పటికీ ఈ గ్రామంలో ప్రతి నెలా 11న వైద్య సేవలు అందిస్తున్నారు.

ఆ కాలనీకి దేవుళ్లు లిలియన్, జోయల్

అమెరికాకు చెందిన లిలియన్ మేయర్, జోయల్ మేయర్‌లు జ్యోతి కాలనీకి సేవలు అందించారు. వీరు 1972లో రైల్వేకోడూరుకు వచ్చారు. వీరికి దక్షిణాంధ్ర లూథరన్ చర్చి ఆవరణలో బంగ్లా ఉండేది. అక్కడ నివాసం ఉండేవారు. జ్యోతికాలనీలో ప్రజల బాధలను గుర్తించి ఇంటి నిర్మాణాలలో పాలుపంచుకున్నారు. అవసరమైన నిధులు ఇచ్చారు. వడ్డీ లేని రుణాలు అందించారు. జ్యోతి కాలనీలో చర్చిని నిర్మించి కాలనీవాసులకు చేయూత అందించారు.

రాష్ట్రంలో 66 కాలనీలు

రాష్ట్రంలో 66 కాలనీలు ఉన్నాయి. ఎక్కువగా తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి ప్రాంతాల్లో కాలనీలు ఉన్నాయి. ఈ కాలనీలు కూడా రోజురోజుకు అభివృద్ధి దిశగా పయనించి ఆదర్శంగా నిలుస్తున్నారు. యాచక వృత్తి వదిలేసి జీవన ప్రమాణాలను మెరుగుపరుచుకుంటున్నారు. కాలనీల్లో యువత ఉద్యోగాల వైపు వెళ్లడంతో స్థితిగతులు మారాయి. దీంతో ఆర్థికంగా కూడా నిలదొక్కుకున్నారని చెప్పవచ్చు.


కాలనీ వాసులు పెంచుతున్న ఆవులు


కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల

కాలనీల అభివృద్ధికి స్లాప్ ఏర్పాటు

రాష్ట్రంలో ఉన్న కాలనీలను అభివృద్ధి చేసుకోవడానికి స్లాప్ అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాము. రాష్ట్ర వ్యాప్తంగా తిరిగి కాలనీలను అభివృద్ధి చేసేందుకు కష్టపడ్డాము. కుష్ఠువ్యాధి అంటువ్యాధి కాదు. గతంలో వివక్ష ఉండేది. ప్రస్తుతం అది లేదు. జీవనశైలి మారింది. పిల్లలు అభివృద్ధి చెందారు. అమెరికా కంటే జ్యోతి కాలనీలో ప్రశాంత జీవనం ఉంది. ఆరోగ్యంగా ఉంటున్నాము. కాలనీ అభివృద్ధి కోసం చాలా బాధలు పడ్డాము.

- కందేరి ధనుంజేయనాయుడు, రాష్ట్ర స్లాప్ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు

జ్యోతి కాలనీలో పాలధార

జ్యోతి కాలనీలో రోజుకు 100 నుంచి 150 లీటర్ల పాలు వస్తున్నాయి. వీటిని తిరుపతిలోని డెయిరీకి సరఫరా చేస్తున్నాము. గ్రామంలో 65 ఆవులు ఉన్నాయి. పాలతో జీవనశైలి మారింది. ఆర్థికంగా గ్రామస్తులు పుంజుకున్నారు.

- పత్తి వరప్రసాద్, పాల కేంద్రం నిర్వాహకుడు

ఆవులు, మేకలతో జీవనోపాధి

ఇచ్చిన ఆవులు, మేకల పెంపకంతో జీవనోపాధి పొందుతున్నాము. ఎక్కడా ఇబ్బందులు లేకుండా జీవిస్తున్నాము. గ్రామంలో ప్రశాంతత ఉంది. కులాలు, మతాలకతీతంగా అందరం బాగా కలసి మెలసి ఉంటాము. ఎక్కడ తేడాలు లేకుండా ఉంటాయి.

- పత్తి మెహరున్నిసా, జ్యోతికాలనీ

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి...

వర్షం వస్తే ఇళ్లు ఉరుస్తున్నాయి. వర్షాకాలంలో కొంత ఇబ్బందిగానే ఉంటుంది. స్థానిక ప్రజాప్రతినిధులు దెబ్బతిన్న ఇళ్లను పరిశీలించి సాయం అందించాలి. ఎలాంటి వివక్ష లేకుండా జీవిస్తున్నాము. గతంలో చాలా ఇబ్బందులు పడ్డాము. అందరి సాయంతో ముందుకుపోతున్నాము.

- టి. మునెమ్మ, జ్యోతికాలనీ

ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోండి

- వివాదాస్పద భూముల్లో జోక్యం చేసుకోం
- భూసమస్యలపై ప్రత్యేక గ్రీవెన్స్‌సెల్ : కలెక్టర్ శ్రీధర్

కురబలకోట/పెద్దతిప్పసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకోవాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువులు, వంకలు, రస్తా పోరంబోకు తదితర భూములను ఆక్రమించుకున్న వారికి నోటీసులివ్వాల్సిన అవసరం లేదని వాటిలో నిర్మాణాలు ఉంటే తొలగించి స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు. కొన్ని సమయాల్లో ఆక్రమణకు గురైన భూములలో పంట సాగు చేసిన, ఇళ్ల నిర్మాణాలు చేపట్టి నివాసం ఉన్న సందర్భాలలో నోటీసులు ఇచ్చి 11 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపారు. అలాగే వివాదాస్పద భూముల్లోకి అధికారులు జోక్యం చేసుకోరని, చట్టపరంగా కోర్టులను ఆశ్రయించి న్యాయం పొందాలని తెలిపారు. అనంతరం కంటేవారివారిపల్లె వద్ద ఉన్న అంగన్‌వాడీ కేంద్రాన్ని, ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసి విద్యార్థుల సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ తపస్విని, ఎంపీడీవో గంగయ్య, ఆర్ఐ బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

పీలేరు తహసీల్దార్‌పై ఫిర్యాదులు

పీలేరు తహసీల్దార్ భీమేశ్వరరావుపై పలువురు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో ఆయన కురబలకోట తహసీల్దార్‌గా పనిచేస్తున్న సమయంలో అనేక భూఅక్రమాలకు పాల్పడటంతో పాటు భారీ స్థాయిలో అవినీతికి పాల్పడ్డారని ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ భూసమస్యలపై కురబలకోటలో త్వరలో ప్రత్యేకంగా గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

ప్రభుత్వ పథకాల్లో ప్రగతి సాధించాలి

ప్రభుత్వం అందించే అభివృద్ధి పథకాల అమలులో సంబంధిత అధికారులు బాధ్యతాయుతంగా పనిచేసి వందశాతం ప్రగతి సాధించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పీటీఎం మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలలో అధికారులు మెరుగైన సాధనకు కృషి చేయాలని తెలిపారు. అపార్ ఐడీ వంద శాతం పూర్తి చేయడంలో పీటీఎం అధికారులు వెనుకబడ్డారని లక్ష్య సాధనలో పనితీరు మెరుగు పరుచుకోవాలన్నారు. అనంతరం తుమ్మరకుంటలోని వరుకసువుపల్లె వద్ద ఆక్రమణదారుల నుంచి స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ఈ భూమిని రక్షించడంలో తహసీల్దార్ శ్రీరాములు నాయక్ చేసిన కృషిని కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో మదనపల్లె సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, హౌసింగ్ పీడీ శివయ్య, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, హౌసింగ్ ఏఈలు, డీటీలు, ఆర్ఐలు, వీఆర్వోలు, సర్వేయర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిసెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

విండ్ పవర్ ప్రాజెక్టులకు గ్రీన్ సిగ్నల్

- వీరబల్లిలో 1800 మెగావాట్‌ల ప్రాజెక్టు
- కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగావాట్‌లతో మరో ప్రాజెక్టు
- వీరబల్లి ప్రాజెక్టుకు 676 ఎకరాల కేటాయింపునకు ప్రభుత్వ అనుమతి



కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప, అన్నమయ్య జిల్లాల్లో రెండు విండ్ పవర్ (గాలి మరలు) పాజెక్టుల ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం వంగిమళ్లలో 1800 మెగావాట్‌ల సామర్థ్యంతో, కడప జిల్లా గంగాదేవిపల్లెలో 252 మెగా వాట్‌ల తోనూ రెండు విండ్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు తదుపరి చర్యల కోసం ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. వీరబల్లి మండలం వంగిమళ్ల వద్ద గతంలో ఆఫ్-స్ట్రీమ్ క్లోజ్‌డ్ లూప్ పంప్‌డ్ స్టోరేజీ (ఏసీపీఎస్‌పీ)విండ్ పవర్ ప్రాజెక్టు ఏర్పాటు చేయడానికి ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. ఇందుకు వంగిమళ్ల వద్ద 490 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పెట్టింది. అనంతరం తాము క్షేత్రస్థాయిలో సాంకేతికపరమైన అధ్యయనాలను పూర్తి చేశామని, ప్రాజెక్టు డిజైను, సామర్థ్యం తదితర అంశాలను పరిగణనలోకి తీసుకోగా ప్రస్తుతం గుర్తించిన 490 ఎకరాలకు అదనంగా మరో 186 ఎకరాలను (మొత్తం 676) కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. సంస్థ అదనంగా కోరుతున్న 186 ఎకరాలతో మొత్తం 676 ఎకరాలను ప్రత్యామ్నాయ ఇంధన కార్పొరేషన్ ఎండీ ప్రభుత్వానికి సిఫారసు చేశారు. ఈ అంశాన్ని పరిశీలించిన ప్రభుత్వం ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్ సంస్థ కోరిన విధంగా కొన్ని షరతులతో మొత్తం 676 ఎకరాలను కేటాయించేందుకు నిర్ణయించింది.

కేటాయించిన భూములను సంస్థ కొనుగోలు చేసేటట్లయితే ఎకరాకు రూ.5 లక్షల వంతున చెల్లించాలని ప్రభుత్వం పేర్కొంది. లేదంటే లీజు పద్ధతిలో అయితే ఎకరాకు ఏడాదికి రూ.31 వేల ప్రకారం చెల్లించాలని తెలిపింది. ఈ రెండింటిలో ఏదో ఒక పద్ధతిని ఎంచుకోవడం సంస్థ నిర్ణయానికే వదిలేసింది. ఈ మేరకు వంగిమళ్ల వద్ద 676 ఎకరాలు కేటాయించి సంస్థకు అప్పగించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖను ప్రభుత్వం ఆదేశించింది.

కడప జిల్లాలో గంగాదేవిపల్లె వద్ద..

కడప జిల్లా గంగాదేవిపల్లె వద్ద 252 మెగా వాట్‌ల సామర్థ్యంతో మరో విండ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేయడానికి ఎకోరెన్ ఎనర్జీ ఇండియా సంస్థ ముందుకొచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో వేయి మెగావాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేసే ప్రాజెక్టుతో పాటు గంగాదేవిపల్లె వద్ద కూడా ఒక ప్రాజెక్టు కోసం ఈ సంస్థ ప్రయత్నాలు ప్రారంభించింది. మొదట్లో గంగాదేవిపల్లె ప్రాజెక్టును గతంలో 230 మెగా వాట్‌ల సామర్థ్యంతో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అయితే గంగాదేవిపల్లె ప్రాజెక్టు సామర్థ్యాన్ని మరో 22 మెగావాట్‌లకు పెంచి మొత్తం 252 మెగావాట్‌లతో నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనలకు స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ బోర్డు ఈనెల 19న జరిపిన సమావేశంలో ఆమోదం తెలిపింది. ఈ ప్రతిపాదనలకు ప్రభుత్వం సానుకూలంగా అనుమతులు ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ఇంధన శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం విడివిడిగా ఆదేశాలు జారీ చేశారు.

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకును తరలించొద్దు

ప్రొద్దుటూరులోని బ్యాంకు ఎదుట సీపీఎం నాయకుల నిరసన



బ్యాంకు ఎదుట నిరసన తెలియచేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడపలో ఉన్న ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలించడం తగదని మంగళవారం ఏపీజీబీ బ్యాంకు వద్ద సీఐటీయూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి విజయకుమార్ మాట్లాడుతూ ఏపీజీబీ బ్యాంకు ఆరు జిల్లాలకు అనుసంధానమై 1.35 కోట్ల ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో రైతులు, పేద ప్రజలకు అందుబాటులో ఉన్న బ్యాంకు అని తెలిపారు. అటువంటి బ్యాంకును అమరావతికి తరలించాలనుకోవడం సరైనది కాదన్నారు. ప్రభుత్వం నిర్ణయాన్ని విరమించుకోవాలని లేదంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు బ్యాంకు తరలింపుపై ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి కడపలోనే కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సాల్మన్, చంటి, రాఘవ, రమాదేవి, అన్నపూర్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలి


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా పశు వైద్యాధికారి

కలికిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులందరూ తమ వద్ద ఉన్న పశు సంపద వివరాలు నమోదు చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై తెలిపారు. ప్రస్తుతం దేశ వ్యాప్తంగా పశుగణన కార్యక్రమం జరుగుతోందని, అన్ని రకాల పశు సంపదకు సంబంధించిన వివరాలను యజమానులు నమోదు చేసుకోవాలని కోరారు. మంగళవారం మండలంలోని కొటాల గ్రామంలో నిర్వహించిన ఉచిత గర్భకోశ వ్యాధి నివారణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పశువులకు సంక్రమించే గర్భకోశ వ్యాధులను గుర్తించి నివారించడంలో యజమానులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. మదనపల్లె పశు సంవర్థక ఉప సంచాలకులు డాక్టర్ కె.సత్యనారాయణ మాట్లాడుతూ చూలు నిలవడంలో పశు పోషణ ప్రాధాన్యత గురించి రైతులకు అవగాహన కల్పించారు. మదనపల్లె సహాయ సంచాలకులు డాక్టర్ విశ్వేశ్వర్‌రెడ్డితో పాటు మదనపల్లె పశు వ్యాధి నివారణ శాస్త్ర నిపుణులు పశువులలో చూలు సామర్థ్యం పెరగడానికి పలు సలహాలు అందజేశారు. తిరుపతి పశుగణాభివృద్ధి సంఘం కార్యనిర్వాహక అధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం, కలికిరి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ వెంకటముని నాయుడు వైద్య శాస్త్రవేత్తల సలహాలను రైతులు పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేవీకే శాస్త్రవేత్తలు డా.నవీన, మాధురి, హేమకుమార్, పశు గర్భకోశ వ్యాధుల నిపుణులు డాక్టర్ గిరినాథరెడ్డి, సచివాలయ పశు సంవర్థక సహాయకులు ఇలియాజ్, సయ్యద్ ఆలీ, అనిల్, కృష్ణవేణి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 50 మంది రైతులకు యూరియా, మొలాసిస్ కలిపిన దాణా బ్లాక్స్‌ను అందజేశారు.

మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం

- జేసీ ఆదర్శ్ రాజేంద్రన్


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జేసీ ఆదర్శ్ రాజేంద్రన్

రాయచోటి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్యంలో దేశ పౌరులకు మార్గదర్శకాన్ని సూచించేదే రాజ్యాంగం అని రాజ్యాంగంలోని పీఠికను ప్రతిఒక్కరూ చదివి అర్థం చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేడుకలను ప్రారంభించే ముందు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి జేసీతో పాటు డీఆర్‌వో మధుసూదన్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ 1949 నవంబరు 26న ప్రజలందరి తరఫున రాజ్యాంగ సభ భారత రాజ్యాంగాన్ని ఆమోదించిందని, అందువల్లనే నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. అంబేడ్కర్ నాయకత్వంలో ప్రపంచంలోని అన్ని రాజ్యాంగాలను క్షుణ్ణంగా చదివి మన దేశంలోని సాంస్కృతిక, భాషల, తదితర వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకుని ప్రపంచంలోనే అత్యుత్తమమైన రాజ్యాంగాన్ని తయారు చేసుకున్నామని తెలిపారు. అనంతరం రాజ్యాంగ పీఠికను కలెక్టరేట్ కో-ఆర్డినేటర్ సెక్షన్ సూపరింటెండెంట్ నరసింహకుమార్ చదువుతూ కార్యక్రమానికి హాజరైన వారందరితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ సిబ్బంది, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అనాథలు.. అభాగ్యులకు ఆసరా ఏదీ?

- నామమాత్రంగా నైట్‌షెల్టర్లు ● పట్టించుకోని ప్రభుత్వాలు
- ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..
- ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు, బస్టాండులే ఆవాసాలుగా...
- దీనావస్థలో అనాథలు, వృద్ధులు



పాతకలెక్టరేట్ వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న వృద్ధులు, అనాథలు

ఎక్కడివారో తెలియదు... ఎవరైనా ఉన్నారో లేదో కూడా తెలియదు. ఎక్కడికి వెళ్లాలో తెలియదు.. తమ గురించి తాము చెప్పుకోలేని స్థితి (మతిస్థిమితం లేనివారు) వారిది.. ఇక నా అనుకున్న వారు నిర్దయగా వదిలేయడంతో తమలో తాము కుమలిపోతూ.. అచేతనావస్థలో (ముసలివారు) ఉన్న వారు కొందరు.. వీళ్లంతా ప్రతి నిత్యం మన కళ్లెదుట కనిపిస్తున్నా పట్టించుకునే వారు అరుదు... దీంతో ఇలాంటి ఎందరో అభాగ్యులు, అనాథలు ఫుట్‌పాత్‌లపై .. రైల్వేస్టేషన్, బస్టాండు, ప్రభుత్వ కార్యాలయాలను ఆవాసాలుగా చేసుకుని... ఎండకు ఎండుతూ... వానకు తడుస్తూ... చలికి వణుకుతూ కనిపిస్తుంటారు. ఎవరైనా కనికరించి ఆహారం పెడితే తినడం, లేదంటే కాళ్లు ముడుసుకుని పడుకుంటారు. ప్రభుత్వాలు గాలికి వదిలేయడంతో వీరికి ఆశ్రయం కల్పించాల్సిన నైట్ షెల్టర్లూ దీనావస్థలో ఉన్నాయి.

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రాంతాల్లో కనిపించే అనాథలు, అభాగ్యు లకు ఆశ్రయం కల్పించాలని 2017లో సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పట్లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం కడప నగరంలోని నాలుగు చోట్ల షెల్ట ర్లు ప్రారంభించాలని చర్యలు చేపట్టింది. అయితే ప్రకాశ్‌నగర్, జడ్పీ ప్రాంగణం, పాత రిమ్స్‌లో మాత్రమే మూడుచోట్ల నైట్‌షెల్టర్లు ఏర్పాటు చేశారు. ఒక్కో షెల్టరుకు 50మందిని కేటాయించారు. 2018లో ఈ షెల్టర్లను ప్రారంభించడం జరిగింది. అయితే రెండింటిలో ప్రకాశ్‌నగర్, పాతరిమ్స్‌లో ఏర్పాటు చేసిన నైట్‌షెల్టర్లకు కాలపరిమితి పూర్తవడంతో గత ఏడాది నుంచి సేవలు నిలిచిపోయాయి. కేవలం జడ్పీప్రాంగణం లో ఉన్న నైట్‌షెల్టరు మాత్రమే కొనసాగుతోంది.

ప్రభుత్వం మారడంతో కథ మొదటికి

శాశ్వత అర్బన్ నైట్ సెంటరు నిర్మాణానికి 2017-18 సంవత్సరంలో మెప్మా ద్వారా నిర్మాణం చేయాలని అప్పటి టీడీపీ ప్రభుత్వం నిధులు కే టాయించింది. ఇంతలోనే ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో మళ్లీ నైట్‌షెల్టర్ల కథ మొదటికి వచ్చిందని చెప్పాలి. అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ షెల్టర్ల గురించి పట్టించుకున్న దాఖలాలు లేవు. మున్సిపల్ అధికారులు వీటిపైన దృష్టిసారించలేదనే చెప్పాలి. ఇప్పటికైనా నైట్‌షెల్టర్లపై అధికారులు, స్థానిక ఎమ్మెల్యే దృష్టిసారిస్తే అభాగ్యులకు కొంత మేలు కలుగుతుందని చెప్పాలి.



జడ్పీ ప్రాంగణంలో గల ప్రేమాలయ నిరాశ్రయుల వసతి గృహంలో అభాగ్యులు, అనాథలు

50 మందికి మాత్రమే పరిమితం

కడప కార్పొరేషన్ పరిధిలో ఏ సర్కిల్ చూసినా... ప్రభుత్వకార్యాలయాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వందలాది మంది అభాగ్యులు అనాథలు కనిపిస్తుంటారు. అయితే కడప కార్పొరేషన్ పరిధిలో మాత్రం ఒకే నైట్ షెల్టరు ఉండడం అది కూడా 50 మందికి మాత్రమే పరిమితం కావడంతో అభాగ్యులకు ఫుట్‌పాత్‌లే శరణ్యమని చెప్పవచ్చు. ఉన్న ఒక్క షెల్టరులో కూడా వృద్ధులకు మాత్రమే ఆశ్రయం కల్పిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ షెల్టర్లలో అనాథలు, వృద్ధులు, అభాగ్యులతో పాటు వివిధ పనుల నిమిత్తం వచ్చేవారికి అవసరమైతే రాత్రి బస ఏర్పాటు చేయాలి. నిర్దిష్ట సమయంలో వచ్చేవారికి భోజనం ఏర్పాటు చేయాలి. కానీ కడప నగరంలో అటువంటి దాఖలాలు లేవు. ఎవరైనా దాతలు భోజన వసతి కల్పిస్తే వృద్ధులకు భోజనం పెడుతున్నారు.



ఫుట్‌పాత్‌లు, రైల్వేస్టేషన్లు వారికి ఆవాసాలు

కడప నగరంలో రాత్రి అయితే రైల్వేస్టేషన్, బస్టాండు, పాత కలెక్టరేట్, సీఎస్ఐ ఫుట్‌పాత్‌లు, ప్రభుత్వ కార్యాలయాలు, అరుగులమీద అనాథలు, నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, మతిస్థిమితం లేనివారు ఎక్కువగా కనిపిస్తారు. ప్రజాప్రతినిధులు, అధికారులు తిరుగాడే ప్రాంతాలైనా వారి కంటికి కనిపించకపోవడం బాధాకరం.

ప్రతి విద్యార్థికి లక్ష్యం.. ప్రణాళిక ముఖ్యం

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదువుతో పాటు నైపుణ్యాలు పెంచుకోవాలని రీజనల్ జాయింట్ డైరెక్టరు డాక్టర్ డీగిరి విద్యార్థులకు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో 2024-25 ఫ్రెషర్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మహిళా సాధికారత, మహిళల విద్య ఆవశ్యకతను వివరించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన మహిళలను ఉదహరిస్తూ విద్యార్థినుల భవిష్యత్తు తీర్చిదిద్దుకోవాలని సూచించారు. ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రిన్సిపల్ డాక్టర్ సలీంబాషా కవితల రూపంలో విద్యార్థినులు ఉన్నతభవిష్యత్తును కలిగి ఉండాలని ఆకాంక్షించారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. పల కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ యోగాంజనేయులు, డాక్టర్ ప్రసాద్‌బాబు, డాక్టర్ రవికుమార్, మైదుకూరు ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, డాక్టర్ శ్యామ్యుల్, డేవిడ్‌రాజ్, ఓబీ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై అవగాహన అవసరం

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జాతీయ పురుగుల నివారణ పద్ధతి యాప్‌పై రైతులతో పాటు వ్యవసాయాధికారులుకు అవగాహన అవసరమని ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.వీరయ్యచౌదరి అన్నారు. జిల్లా వ్యవసాయాధికారి కార్యాలయంలో మంగళవారం ఎన్‌పీఎస్ఎస్ యాప్‌పై వైఎస్ఆర్, అన్నమయ్య జిల్లాల వ్యవసాయ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన చౌదరి మాట్లాడుతూ యాప్ గురించి వివరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వర్‌రావు మాట్లాడారు. వైఎస్ఆర్, అన్నమయ్యజిల్లాల ఏడీఏలు మాధవీ, మజీద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్ పాల్గొన్నారు.

విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ వద్దు : ఎస్ఈ



మాట్లాడుతున్న జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ

మైదుకూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ బకాయిలను ఎక్కడ రాజీపడకుండా వసూళ్లు చేయాలని జిల్లా విద్యుత్‌శాఖ ఎస్ఈ రమణ అధికారులకు ఆదేశించారు. స్థానిక విద్యుత్‌శాఖ కార్యాలయాన్ని మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులు, బిల్లుల గురించి విచారణ చేసి రికార్డులు పరిశీలించారు. విద్యుత్ బకాయిలు చెల్లించలేని విని యోగదారుల కరెంటు కనెక్షన్ తొలగించాలన్నారు. ఈ తనిఖీలో ఇంజనీర్లు భరణి కృష్ణ, శ్రీనివాసులరెడ్డి ఉన్నారు.

పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తి అరెస్టు

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన సిరిగేపల్లి యశ్వంత్‌ను మంగళవారం అంబకపల్లి క్రాస్‌రోడ్డు వద్ద అరెస్టు చేసినట్లు పులివెందుల డీఎస్పీ మురళీ తెలిపారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో నివాసం ఉంటున్న కళ్ల శృతి అనే యువతిని యశ్వంత్ గత మూడు సంవత్సరాలుగా ప్రేమించాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు యశ్వంత్‌పై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు. అనంతరం కడప కోర్టుకు హాజరుపరిచినట్లు డీఎస్పీ తెలిపారు.

హత్యాయత్నం కేసులో ఐదుగురి అరెస్టు

కడప క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కడపనగరం ప్రకాశ్‌నగర్ వద్ద ఈ నెల 23న హోంగార్డు అతని సోదరులపై హత్యాయత్నానికి పాల్పడిన ఐదుగురిని ప్రకాశ్‌నగర్ వద్ద అరెస్టు చేసినట్లు చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. ప్రకాశ్‌నగర్‌కు చెందిన హోంగార్డు షేక్ లాల్‌బాషా, అతని సోదరుడు సర్దార్‌బాషాలు ముత్తరాసుపల్లెకు చెందిన రంగాకు కొంత డబ్బు బాకీ ఉన్నారు. డబ్బు విషయమై ఈనెల 23న రంగా షేక్‌లాల్‌బాషాల మధ్య మాటామాటా పెరిగింది. దీంతో రంగా జిలానీ, అరుణ్‌కుమార్, మనోజ్ ప్రవీణ్‌కుమార్‌లతో కలిసి వారిపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. ఈ కేసుకు సంబంధించి ఐదు గురిని అరెస్టు చేసి రిమాండుకు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

రాయచోటి టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 15వ నెంబరు చౌక దుకాణంలో పనిచేసే శ్రీను అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మంగళవారం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు మండల పరిధిలోని కురవపల్లికి చెందిన శ్రీను కొంత కాలంగా పట్టణంలోని బోస్ నగర్‌లో నివాసముంటున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఆయన మంగళవారం ఉదయం వరిగపాపిరెడ్డిగారి పల్లెకు వెళ్లే దారిలో మృతి చెంది కనిపించాడు. స్థానికులు సమాచారం అందించడంతో పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అతని కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, మృత దేహం పక్కనే మద్యం సీసా ఉండడంతో, మద్యంలో విషం కలుపుకుని తాగి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని భావిస్తున్నారు.

పెన్షనర్లకు కమ్యుటేషన్ కట్ చేయకుండా ప్రభుత్వ మెమో

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పెన్షనర్లకు సంబంధించి 135 నెలలు నిండిన పెన్షనర్లందరికీ బేసిక్ పే నుంచి కమ్యుటేషన్ (40శాతం) మొత్తాన్ని కట్ చేయకుండా ప్రభుత్వం మెమో విడుదల చేసిందని ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామ్మూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్, ఉపాధ్యక్షుడు నారాయణ సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఉత్తర్వులు ఇచ్చేంత వరకు ఈ మెమో అమలులో ఉంటుందన్నారు. 135 నెలల పెన్షన్ కాలం ముగిసిన వారందరికీ ఈ మెమో ద్వారా ఆర్థిక లాభం కలుగుతుందని చెప్పారు. కోర్టు ఉత్తర్వులు పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం వెంటనే స్పందించి తగిన మెమో ద్వారా రాష్ట్రంలోని అన్ని ట్రెజరీ కార్యాలయాలకు ఉత్తర్వులు ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు.

చెస్‌లో అంతర్జాతీయ రేటింగ్ సాధించిన కడప చిన్నారి అమీనా



కడప స్పోర్ట్స్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి) : కడప నగరానికి చెంది న చెస్ క్రీడాకారిణి (8) అమీనా చదరంగంలో అంతర్జాతీయ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ (1407) సాధించింది. చెన్నై నగర రాయపేటలో గత జులైలో జరగిన రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ టోర్నమెంట్‌లో రేటెడ్ క్రీడాకారుడిపై అమీనా విజయం సాధించడంతో ఆ రేటింగ్ దక్కినట్లు జిల్లా చెస్ కార్యదర్శి అనీస్ దర్బారి వెల్లడించారు. నగర శివారు ప్రాంత విస్‌డమ్ స్కూల్‌లో 3వ తరగతి చదువుతున్న అమీనా చదరంగంలో మునుముందు మరిన్ని స్ఫూర్తిదాయక విజయాలు అందుకోవాలని ఆకాంక్షించారు.

ప్రతి పౌరుడు రాజ్యాంగం ప్రాముఖ్యతను తెలుసుసుకోవాలి

- జిల్లా ప్రధాన జడ్జి శ్రీదేవి

కడప రూరల్, నవంబర్ 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పౌరుడు రాజ్యాంగం ఉద్దేశ్యం, ప్రాముఖ్యతను తప్పక తెలుసుకొని అందుకు అనుగుణంగా నడుచుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్రధాన జడ్జి మాట్లాడుతూ రాజ్యాంగం ప్రాముఖ్యత, ముసాయిదా కమిటీ, అవిశ్రాంత ప్రయత్నాల గురించి దేశ పౌరులకు అవగాహన కల్పించడం, గుర్తు చేయడం కోసం రాజ్యాంగ ముసాయిదా కమిటీ అధ్యక్షుడైన డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు నివాళులు అర్పించేందుకు నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవంగా నిర్వహించడం జరుగుతోందన్నారు. పౌరుల ఆకాంక్షలకు, సమాజంలోని మార్పులకు అనుగుణంగా ఉండాలని భావించి భారత రాజ్యాంగం రూపొందించబడిందన్నారు.



జిల్లా కోర్టులో రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న ప్రధాన జడ్జి శ్రీదేవి, జడ్జిలు, న్యాయవాదులు తదితరులు

విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులు

భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో విరివిగా న్యాయవిజ్ఞాన సదస్సులను నిర్వహించారు. కడప నగరంలోని బసిరెడ్డి లా కళాశాల, ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయవిజ్ఞాన సదస్సులను సీనియర్ సివిల్ జడ్జి బాబాఫక్రుద్దీన్ నిర్వహించి భారత రాజ్యాంగం ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. కార్యక్రమాలలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి, మొదటి అదనపు, ఆరవ, ఏడవ అదనపు జిల్లా న్యాయమూర్తులు వెంకటేశ్వరరావు, షేక్ ఇంతియాజ్ అహ్మద్, జి.రమేష్‌కుమార్, ఆయా కోర్టుల జడ్జిలు ప్రవీణ్‌కుమార్, కె.ప్రత్యూషకుమారి, జె.హేమ స్రవంతి, జె.నందిని, కె.భార్గ వి, జి.విజయలక్ష్మి, న్యాయవాదులు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందించాలి

- జడ్పీ సీఈవో ఓబులమ్మ

కడప రూరల్, నవంబర్ 26(అంధ్రజ్యోతి): రాజ్యాంగ ఫలాలు అర్హులకు అందేలా అధికారులు మరింత బాధ్యతగా పనిచేయాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం వేడుకలను జడ్పీలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. జడ్పీ వైస్ ఛైర్మన్ బాలయ్య, వల్లూరు జడ్పీటీసీ వెంకటసుబ్బయ్య, ఏపీపీఆర్ ఎంఈఏ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు లంకా మల్లేశ్వరరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎస్ఎస్‌ను రైతులు ఉపయోగించుకోవాలి

- జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

కడప రూరల్, నవంబర్ 26 (అంధ్రజ్యోతి): పంటలకు ఆశించు పురుగులను నివారించి తద్వారా ఆశించిన దిగుబడులను సాధించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన నేషనల్ పేస్ట్ సర్వేయిలెన్స్ సిస్టమ్(ఎన్‌పీఎస్ఎస్) యాప్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి ఏ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం పురుగుల నియంత్రణ పద్ధతుల గురించి అవగాహన, శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖలో రైతులకు ఉపయోగకరమైన మార్పులు వస్తున్నందువలన ఎన్‌పీఎస్ఎస్ యాప్ రైతులకు చాల ఉపయోగకరమన్నారు. రైతులకు పురుగులు, తెగుళ్లు, నివారణా చర్యలు ఈ యాప్ ద్వారా త్వరగా తెలుసుకొని తద్వారా పంటలను రక్షించుకోవచ్చన్నారు. రైతులు వారి ఆండ్రాయిడ్ ఫోన్లో ప్లే స్టోర్ ద్వారా ఎన్‌పీఎస్ఎస్‌ను డౌన్‌లోడ్ చేసుకుని.. దానిలో వారు పండించే పంటలకు సంబంధించి ఏదేని చీడ పీడలు ఆశించినప్పుడు వాటి ఫొటోలను యాప్‌లో ఉంచితే.. ఎలాంటి నివారణా చర్యలు తీసుకోవాలో తెలుసుకోవచ్చన్నారు. విజయవాడ కార్యాలయం నుంచి వచ్చిన ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె. వీరయ్య చౌదరి ఎన్‌పీఎస్ఎస్ యాప్‌ను ఏవిధంగా ఉపయోగించాలో వివరించారు. యాప్ ఉపయోగాలు తెలియజేశారు. కార్యక్రమంలో ఏడీఏలు ఎం.మాధవి, మజీద్ అహ్మద్, టెక్నికల్ ఏవో గోవర్ధన్, మండల వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యసాయశాఖాధికారి నాగేశ్వరరావు

అరాచక పాలనతో అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు

- వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్, నవంబరు26(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికా రంలోకి వచ్చినప్పటి నుంచి అరాచక పాలనతో రాష్ట్రంలో అంబేడ్కర్ రచించిన రాజ్యాంగానికి తూట్లు పొడిచారని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్య దర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మండిపడ్డారు. జగన్‌పైన నిరాధార ఆరోప ణలతో పాలనను పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. మంగళవారం రాయచోటిలోని వైసీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లా డుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులకు రాష్ట్ర ప్రభుత్వం తిలోదకాలు ఇవ్వడం మంచి సంప్రదాయం కాదన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయ కోణంలో ఆలోచించి వ్యక్తులను కులాలతో విడదీస్తుండడం బాధాకరమ న్నారు. ఏ ఒక్కరు గొంతు విప్పినా పోలీసుల ద్వారా భయభ్రాంతులకు గురిచేయడం, వారిని వ్యక్తిగతంగా బెదిరించడం, చట్టంలోని లొసుగుల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా కేసులు పెట్టి వేధింపులకు గురిచేయడం తగదన్నారు. ఎవ్వరిపై కూడా అసభ్యకర పోస్టులు పెట్టకూడదని, ముఖ్యంగా మహిళలను కించపరిచే పోస్టులను తమ పార్టీ సమర్థించదన్నారు. ప్రభుత్వ విధానాల్లో తప్పిదాలను ఎత్తి చూపితే కూడా కూటమి ప్రభుత్వం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోందన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ ఉద్యోగులకు మేలు జరగ లేదని కూటమి నేతలు గగ్గోలు పెట్టారన్నారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు ఇచ్చిన హామీ లను ఆరు నెలలు అవుతున్నా ఇంతవరకు అమలు చేయకపోవడం ఏంటని ప్రశ్నించారు. రాయచోటి మున్సిపల్ ఛైర్మన్ ఫయాజ్ బాషా, వైస్ ఛైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్ గౌస్‌ఖాన్, బీసీ సెల్ విజయభాస్కర్ పాల్గొన్నారు.

రైస్‌పుల్లింగ్ పేరిట రూ.1.34 కోట్లకు మోసం

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులో రైస్ పుల్లింగ్ పేరిట రూ.134కోట్ల మోసానికి పాల్పడ్డ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేశామని టూటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. దువ్వూరు మండలం గోపలాపురం గ్రామానికి చెందిన మూలేవెంకట రమణారెడ్డి వడ్ల వ్యాపారం చేసేవాడు. అతని భార్య ఆర్టీసీ కండక్టర్. ఆమెకు పరిచయం ఉన్న ప్రొద్దుటూరు పట్టణం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శోభారాణి రైస్‌పుల్లింగ్ వ్యాపారాన్ని పరిచయం చేసింది. ఇందులో పెట్టుబడి పెడితే ఒకటికి పదింతలు డబ్బులు వస్తాయని ఆశ చూపింది. దీనికి సంబంధించి తమ కజిన్స్ అయిన బెంగళూరుకు చెందిన అపర్ణ, కదిరికి చెందిన అరుణను పరిచయం చేసింది. దీంతో రమణారెడ్డి ప్రొద్దుటూరులో తనకు తెలిసిన వారందరితో రైస్‌పుల్లింగ్ వ్యాపారంలో దాదాపు రూ.1.34 కోట్ల పెట్టుబడులు పెట్టించాడు.

అయితే వీరిలో ఏ ఒక్కరికీ ఒక్క రూపాయి కూడా లాభం రాలేదు. దీంతో మోసం చేశారని వీరిపై మంగళవారం టూటౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయగా.. ఆ ముగ్గురు మహిళలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు సీఐ వెల్లడించారు. కాగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు మహిళలను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

పంటల బీమా కోసం దరఖాస్తు చేసుకోండి

లింగాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రబీలో పంటలు సాగుచేసిన రైతులు బీమా కోసం ప్రీమియం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ శాఖాధికారి రమేష్ రైతులకు సూచించారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పథకం ద్వారా ప్రభుత్వం పంటల బీమాను అమలు చేస్తోందని ఆయన పేర్కొన్నారు. బ్యాంకు రుణం రెన్యువల్ ద్వారా కానీ, సీఎస్‌సీ ద్వారా కానీ, ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పోర్టల్ ద్వారా కానీ బీమా ప్రీమియం చెల్లించ వచ్చని రమేష్ వివరించారు.

టీడీపీలో కార్యకర్తలకు భరోసా

● సభ్యత్వ నమోదులో ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప మారుతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీలో కార్యకర్తలకు పూర్తి భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే మాధవి, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడప నగర 24వ డివిజన్ టీడీపీ ఇన్‌చార్జ్ ఎం.వి అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో రాజారెడ్డి వీధిలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కార్యకర్తలే పార్టీకి పునాదులుగా భావించి ఆది నుంచి తెలుగుదేశం పార్టీ ముందుకుసాగుతోందన్నారు. ఇందులో భాగంగా సభ్యత్వం తీసుకున్న కార్యకర్తలు ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు. రూ.5 లక్షల ప్రమాద బీమా అందజేస్తుందన్నారు. సాధారణ మరణం సంభవించినా మట్టి ఖర్చుల కింద వారి కుటుంబానికి రూ.10వేలు అందిస్తుందన్నారు.

కావున కార్యకర్తలు, అభిమానులు తప్పక పార్టీ సభ్యత్వం తీసుకోవాలని కోరారు. అనంతరం అశోక్‌రెడ్డి తెలుగుదేశం పార్టీకి 1 లక్ష రూపాయలతో పార్టీ శాశ్వత సభ్యత్వం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర పరిశీలకురాలు కుసుమకుమారి, 42వ డివిజన్ టీడీపీ సీనియర్ నాయకుడు బొమ్మిశెట్టి చంద్రశేఖర్, డివిజన్ నాయకుడు ఫరూక్, క్రిష్ణ, గురు, తేజారెడ్డి, జయంత్, శ్రీనాథ్, సందీప్, విశ్వనాథ్, గణేష్ తదితరులు సభ్యత్వం స్వీకరించారు.

సీఎం సహాయనిధి పంపిణీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీఎం సహాయనిధికి సంబంధించి 13 మంది లబ్ధిదారులకు రూ.15.47,902 విలువైన చెక్కులను ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అందించారు.

చిత్రం చెప్పిన సమస్య



గంగవరం-చాపాడు గ్రామాల రహదారి దుస్థితి ఇది. కమలాపురం నుంచి గంగవరం చాపాడు మీదుగా ప్రొద్దుటూరు వెళ్లడానికి దగ్గర దారి ఇదే కావడంతో నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. వర్షాలకు దెబ్బతినడం, తాత్కాలిక మరమ్మతులు చేసి వదిలేయడంతో వర్షాలు కురిసినప్పుడు పెన్నాకు నీరు వస్తే మళ్లీ కోతకు గురవుతోంది. దీంతో ఈ దారిన రాకపోకలు సాగించాలంటే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు.

-కమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి)

రికార్డుల్లో వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలి: ఆర్డీఓ

వల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భూమి రికార్డుల్లో వివరాలు జాగ్రత్తగా నమోదు చేయాలని ఆర్డీఓ జాన్ ఎర్విన్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలో హైకోర్టులో ఉన్న భూముల కేసులకు సంబంధించి మంగళవారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆర్డీఓతో పాటు తహసీల్దారు శ్రీవాణి ఉన్నారు. అంతకు ముందు స్థానిక తహసీల్దారు కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూమి రికార్డుల్లో అంశాలను పొందుపరిచేటప్పుడు ప్రతి ఒక్కరూ సరైన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. అలాగే ప్రతి అధికారి క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించాలని, అప్పుడే మనం రైతులకు న్యాయం చేయగలుగుతామన్నారు. ఇలా చేయడం ద్వారా రైతులు తమ పొలాల సరిహద్దులు తెలుసుకోవచ్చని వివరించారు. అనంతరం హైకోర్టులో ఉన్న కొన్ని కేసులకు సంబంధించిన భూములను స్థానిక తహసీల్దారుతో కలిసి పరిశీలించారు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం

● కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి




జీవామృతం తయారు చేసే విధానాన్ని రైతులతో పాటు ఎమ్మెల్యేకు వివరిస్తున్న వ్యవసాయాధికారులు

వల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. మంగళవారం చిన్నలేబాక గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులకు శిక్షణ ముగింపు కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు సేంద్రియ ఎరువులు వాడితే దిగుబడి పెరుగుతుందన్నారు. భూమి కూడా సారవంతంగా ఉంటుందన్నారు. కానీ రసాయనిక ఎరువులు ఎక్కువగా వాడుతుండటంతో భూమి బంజరు పోతోందని, నేలలోని మిత్రపురుగులు కూడా చనిపోయి తెగుళ్లు ఎక్కువవుతున్నాయని వివరించారు. ఎప్పుడైతే రసాయన ఎరువులు తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని అలవాటు చేసుకుంటారో పంటలు సమృద్ధి గా పండుతాయన్నారు. సేంద్రియ పద్ధతిలో పండించిన పంటలకు మంచి గిరాకీ ఉంటుందన్నారు. కావున వ్యవసా య అధికారులు, సిబ్బంది రైతులకు మంచి శిక్షణ అందించాలని, శిక్షణలో నేర్చుకున్న అంశాలకు రైతులు అలవాటు పడేలా చూడాలని సూచించారు.

అనంతరం జీవామృతం తయారు చేసే విధానాన్ని వ్యవసాయాధికారులు వివ రించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ నరసింహారెడ్డి, ప్రకృతి వ్యవసాయ డీపీఎం ప్రవీణ్‌కుమార్, స్థానిక ఏవో సాయిజ్యోతి, టీడీపీ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి, ఎంపీడీఓ రఘురాం, రైతులు సుబ్బారెడ్డి, ఓబులరెడ్డి, రామచంద్రారెడ్డి, భూషయ్య, మధు, చిన్నలేబాక గ్రామానికి చెందిన మధు, రెవెన్యూ, సచివాలయ, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





మహోన్నతమైనది భారత రాజ్యాంగం

కడప మారుతీనగర్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 'మహోన్నతమైనది భారత రాజ్యాంగం'అని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి, మహాజన రాజ్యం పార్టీ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు సంగటి మనోహర్ అన్నారు. భారత రాజ్యాంగం ఆమోదం పొంది 75వ సంవత్సరంలోకి అడుగిడిన సందర్భంగా రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో సంగటి మనోహర్ అధ్యక్షతన ఐక్య ప్రజాస్వామ్య సమ్మేళనం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి టీడీపీ ముస్లిం నాయకుడు వి.ఎస్. అమీర్‌బాబు, జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ అధ్యక్షుడు అవ్వారు మల్లికార్జున, శాంతి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు రాజారత్నం ఐజాక్, న్యాయవాది షేక్ అమీన్ పీరాన్, అఖిలపక్ష నాయకులు బి. నారాయణరెడ్డి, హేతువాద సంఘం జిల్లా కన్వీనర్ సి.ఆర్.వి. ప్రసాద్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వేదిక రాష్ట్ర నాయకడు జె.వి.రమణ మాట్లాడారు. భారత రాజ్యాంగ గొప్పతనాన్ని, ఔన్నత్యాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు.



సంఘీభావం తెలుపుతున్న వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

గొప్ప దార్శనికుడు అంబేడ్కర్: వీసీ

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి కొనియాడారు. మంగళవారం భారత రాజ్యాంగాన్ని ఆమోదించిన సందర్భంగా సంవిధాన్ దివస్ నిర్వహించారు.

బహుమతులు అందించిన డీఈఓ

కడప నగరం సీఎస్ఐ పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు జోనల్ స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో వ్యాసరచన వక్తృత్వ క్విజ్ పోటీలు, గేయాల పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు డీఈఓ మీనాక్షి బహుమతులను అందించారు.



సీఎస్ఐ పాఠశాల విద్యార్థులతో డీఈఓ మీనాక్షి

రాజ్యాంగానికి కట్టుబడి విధులు నిర్వహించాలి

కడప కలెక్టరేట్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి కట్టుబడి విధులు నిర్వహించాలని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి రఘురాం నాయుడు అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లా కార్యదర్శి సుదర్శన రెడ్డి, నగర అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణప్రసాద్, నాగరాజు, వెంకట సుబ్బయ్య, చంద్రశేఖర్, నగర కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

సింహాద్రిపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని సింహాద్రిపురం వివేకానంద హైస్కూల్‌లో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కరస్పాండెంట్ ఖాదర్‌వలి రాజ్యాంగం విశిష్టతను, ఆవశ్యకతను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ జాఫర్,ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న కరస్పాండెంట్ ఖాదర్‌వలి, డైరెక్టర్ జాఫర్

రక్తదానం చేయండి.. ప్రాణాలు కాపాడండి



రక్తదాన శిబిరంలో ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి తదితరులు

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలు కాపాడిన వారవుతారని కడప చిన్నచౌకు ఎస్ఐ రాజరాజేశ్వర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరం ఆర్టీసీ బస్టాండు శ్రీరామ్ ఫైనాన్స్ రీజనల్ కార్యాలయంలో శ్రీరామ్ ఫైనాన్స్ 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని రాజరాజేశ్వర్‌రెడ్డి, బిజినెస్ హెడ్ చంద్రశేఖర్ ప్రారంభించారు. సంస్థలో పనిచేస్తున్న వంద మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేశారు. కార్యక్రమంలో రీజనల్ కలెక్షన్ హెడ్ శివరాజ్, సీనియర్ బ్రాంచ్ మేనేజరు వెంకటశివరాజు, సంస్థ ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీ



కడప సెవెన్‌రోడ్స్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):రైతు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కళాక్షేత్రం నుంచి 1వ గాంధీ విగ్రహం, మద్రాసు రోడ్డు, పొట్టిశ్రీరాములు విగ్రహం, సెవెన్‌రోడ్స్ వరకు సాగింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శులు భాస్కర్, దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అన్వేష్ మాట్లాడారు.

ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్‌డీడీ, వైద్యులు, విద్యార్థులు

కడప(వినాయకనగర్), నవంబరు26(ఆంధ్రజ్యోతి): ఆయుర్వేదంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఆయుశ్ శాఖ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్‌రాజు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన దేశ్ కి ప్రకృతి పరీక్షణ్ అబియాన్ ఆయుర్వేద యాప్‌ను మంగళవారం ఘనంగా ప్రారంభించారు. అనంతరం ఆయుర్వేద విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య పరిస్థితులు, జీవనశైలి విధానాన్ని యాప్‌లో ఉంటాయన్నారు. అనంతరం జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సింగం మురళి మాట్లాడారు. హోమియోపతి వైద్యశాల సూపరింటెంట్ డాక్టర్ ఆనందరావు, అసిస్టెంట్ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ రాంమూర్తినాయక్, డాక్టర్లు సీహెచ్ పరిమళ, లక్ష్మిదేవి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పట్టణంలోని ఆయన నివాసంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలు చెప్పుకుని వినతిపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీకి కడపలో ఉచిత శిక్షణ

కడప ఎన్టీఆర్ సర్కిల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కడప నగరంలో మెగా డీఎస్సీకి ఉచితంగా శిక్షణ ఇస్తున్నట్లు ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే ఆర్.మాధవి పేర్కొన్నారు. కడప నగరం పాత రిమ్స్‌లోని ఏపీబీసీ సంక్షేమ భవనంలో మంగళవారం మెగా డీఎస్సీ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసిందన్నారు. డీఎస్సీ అభ్యర్థులు ఈ ఉచిత శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

గౌరవ వేతనం ఇవ్వాలి

కడప ఎడ్యుకేషన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :స్కూలు మేనేజ్‌మెంటు కమిటీకి గౌరవవేతనం ఇవ్వాలని ఏపీటీఎఫ్ అమరావతి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఈశ్వర చంద్ర, ఆలీఖాన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్ఎంసీ నిధులపై ప్రత్యేక ఉత్తర్వులు విడుదల చేయాలన్నారు.

అమృత్ సరోవర్‌ను సద్వినియోగం చేసుకోండి

సికెదిన్నె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమృత్ సరోవర్ కార్యక్రమాన్ని రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కుళాయిబాబు తెలిపారు. చింతకొమ్మదిన్నె మండలం కొప్పర్తి చెరువు వద్ద జాతీయ ఉపాధి హామీ సిబ్బందితో కలిసి చెరువులను కాపాడుకుందామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీవో రామాంజనేయులరెడ్డి, పంచాయతీ సచివాలయ సిబ్బంది, ఉపాధి హామీ సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు వద్దు.. చదువే ముద్దు: సీఐ

చెన్నూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'బాల్యవివాహాలు వద్దు... చదువే ముద్దు' అని సీఐ పురుషోత్తం రాజు అన్నారు. స్థానిక ఎంపీడీవో సభా భవనంలో మంగళవారం కిశోరి వికాసంపై మండలంలోని అన్ని శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీ, వైద్యసిబ్బందికి శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ 11 ఏళ్ల నుంచి 18 ఏళ్ల కౌమార దశలో బాలికల పట్ల మరిం త శ్రద్ధ కనబరిచి వారికి భవిష్యత్తు అందించాల న్నారు. ఈఓఆర్‌డీ సురేశ్‌బాబు, ఎంఈఓలు గంగిరెడ్డి, సునీత, ఏపీఎం వెంకటేశ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు గురమ్మ, నాగరత్నమ్మ, వైద్యాధికారి చెన్నారెడ్డి పాల్గొన్నారు.

ఆడపిల్లలను శక్తివంతంగా తీర్చిదిద్దాలి

పులివెందుల రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను శక్తివంతంగా తీర్చిదిద్దాలని వెలుగు ఏపీఎం గురురాజ్, ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి, ఎంఈఓ రామానాయుడు పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో 'కిశోరి వికాసం' గ్రామస్థాయి శిక్షకుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

29న వాహనాల వేలం

పులివెందుల టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పులివెందుల ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఈ నెల 29న వాహనాల వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ చెన్నారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ల ఆవరణంలో వేలం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

విజయదుర్గాదేవి ఆలయంలో రాహుకాల పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గాదేవి.. ఆలయంలో రాహుకాల పూజలు చేస్తున్న భక్తులు

కడప కల్చరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అమ్మలగన్న అమ్మ కడప విజయదుర్గమ్మ ఆలయం రాహుకాల దీప కాంతులతో దేదీప్యమానంగా ప్రకాశించింది. కార్తీక మాసం చివరి మంగళవారం కావడంతో మహిళా భక్తులు పెద్ద సంఖ్యతో ఆలయానికి తరలి వచ్చి నిమ్మకాయలతో కూడిన రాహుకాల దీపాలను భక్తిప్రపత్తులతో వెలిగించి ఆ తల్లి శరణుకోరి ఆశీస్సులందుకున్నారు. రాయలసీమ నలుచెరుగుల నుంచి మహిళలు హాజరై ఆ తల్లి సేవలో తరించారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి

వేంపల్లె, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి వ్యాసరచన పోటీల్లో వేంపల్లె శ్రీచైతన్య హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. లిఖిత, దీక్షిత, తనుశ్రీలు మొదటి మూడుస్థానాల్లో, తెలుగులో పౌర్ణిమ, మనోజ్‌కుమార్, దీక్షితరెడ్డిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచినట్లు తెలిపారు. పోటీలలో తమ విద్యార్థులు ఉత్తమ స్థానాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు.

మనది గొప్ప రాజ్యాంగం

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగం చాలా గొప్పదని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు.మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మైదుకూరు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులు అర్పించారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మాజీ కౌన్సిలర్ తలారి పుల్లయ్య, గాలిపోతుల సుదర్శన్, తలారి రమేష్, తలారి ఐజయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం అందరికీ దిక్సూచి

బద్వేలు , నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగం మన అందరికీ దిక్సూచి అని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన రాజ్యాంగం ప్రపంచంలోకెల్లా అత్యంత గొప్పదని కొనియాడారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, గురుమోహన్, సుందరరామిరెడ్డి, బోడపాడు రామ సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్‌తో రైతుల్లో టెన్షన్..!

● పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం ● శనగ, ఇతర రైతులకు భారీ నష్టం



మోరగుడిలో శనగ పొలంలో మట్టి తీసి తడి ఉందని చూపుతున్న రైతు, కంకిదశలో ఉన్న జొన్న



జమ్మలమడుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తుఫాన్‌తో రైతుల్లో టెన్షన్ నెలకొంది. పంటలు సాగు చేయడానికి అప్పు, ఇతర ఇబ్బందులు పడి తెచ్చుకుని పంట సాగు చేసి తీరా చేతికొచ్చే సమయంలో తుఫాన్ రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చుతోంది. పది రోజుల క్రితం అకాల వర్షంతో పంట పొలాల్లో నీరు చేరి వరి పొలాలు పూర్తిగా కంకిదశలో ఒరిగిపోయి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ మేరకు వ్యవసాయాధికారులు దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి ప్రాథమిక రిపోర్టు ఉన్నతాధికారులకు తెలిపారు. అందులో భాగంగా జొన్న పంట కంకిదశలో వరి పంటలు చేతికొచ్చే సమయంలో మబ్బులు, మోడాలు, చిరుజల్లులతో రైతులకు గుండెల్లో దడ ఎత్తుకుంది. ఇంత కష్టపడి పంట చేతికొస్తుందని ఆశతో ఉన్న సమయంలో వర్షం ఇబ్బంది కలిగిస్తోందని వాపోతున్నారు. అలాగే జమ్మలమడుగు మండలంలో సుమారు 11 వేల ఎకరాల్లో శనగ పంట సాగు చేశారని ఏవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం మంగళవారం నుంచి మూడు రోజులపాటు తుఫాన్ ఉందని హెచ్చరికలు చేస్తున్నారని, తమకు దిక్కుతోచడంలేదని, ముందుగానే శనగ పంటలో తడి ఉందని ఇప్పటికే అక్కడక్కడ సాగు చేసిన శనగ పంట నీరు నిలబడి దెబ్బతిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి వర్షం వస్తోందని పంట పొలాల వద్ద భయంతో చూసుకోవడానికి వెళ్లాల్సి వస్తుందని వాపోయారు. తుఫాన్ రైతాంగానికి భారీ నష్టం చేకూర్చే విధంగా ముంచుకొస్తోందని రైతాంగం ఆవేదనలో ఉంది.

రుణాలతో మహిళల ఆర్థిక ప్రగతి

● వెలుగు ఏపీఎం శ్రీధర్



చాపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం, బ్యాంకులు ఇస్తున్న రుణాలతో గ్రామీణ మహిళలు ఆర్థిక పురోగతి సాధిస్తున్నట్లు వెలుగు ఏపీఎం దేవతి శ్రీధర్ చెప్పారు. మహిళలు వారు తీసుకున్న రుణాలు తిరిగి సక్రమంగా చెల్లిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలవారి వృత్తుల ఆధారంగా రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పిల్లల చదువులకు కూడా రుణాలు ఇస్తున్నామన్నారు. ఇంకా ఆయన మాటల్లోనే...

ప్రశ్న: మండలంలో మొత్తం ఎన్ని డ్వాక్రా సంఘాలు ఉన్నాయి?
జవాబు: 976 సంఘాలు.
ప్రశ్న: బాగా పనిచేస్తున్న సంఘాలు ఎన్ని ఉన్నాయి?
జవాబు: 966.
ప్రశ్న: ఒక్కో సంఘంలో ఎంత మంది సభ్యులు ఉన్నారు?
జవాబు: 5 నుంచి 10 మంది.
ప్రశ్న: మహిళలకు రుణాలు ఏయే సంస్థలు ఇస్తున్నాయి?
జవాబు: ప్రభుత్వం బ్యాంకు స్త్రీనిధి, ఉన్నతి, కమర్షియల్ ఇన్వెస్టిమెంట్ ఫండ్‌ల ద్వారా ఇస్తున్నారు.
ప్రశ్న: రుణాలు ఎలాంటి వారికి ఇస్తున్నారు?
జవాబు: వ్యవసాయ కూలీలకు, పాడి, కోళ్ల పరిశ్రమ, పొట్టేళ్ల పెంపకం, టిఫిన్ సెంటర్లు, వస్త్ర వ్యాపారం తదితర వాటికి ఇస్తున్నాం.
ప్రశ్న: వ్యక్తిగత రుణాలు ఎలాంటివాటికి ఇస్తారు?
జవాబు: ఒక్కొక్క మహిళకు వ్యక్తిగతంగా రూ.5 లక్షల వరకు ఇస్తున్నాం. టీకప్పులు, పేపర్ ప్లేట్లు, సేమియాలు తయారు చేయడం వంటి వాటికి ఇస్తున్నాం.
ప్రశ్న: 2023-24 సంవత్సరంలో ఎన్ని గ్రూపులకు ఎంత డబ్బులు ఇచ్చారు?
జవాబు: 512 గ్రూపులకు రూ.57 కోట్లు ఇచ్చాం.
ప్రశ్న: 2024-25లో ఎంత డబ్బులు ఇచ్చారు.
జవాబు: 82 సంఘాలకు రూ.12 కోట్లు ఈరోజు వరకు ఇచ్చాం.
ప్రశ్న: ఏవైనా అవార్డులు పొందారా?
జవాబు: 2015లో రాష్ట్రస్థాయిలో, 2017లో జిల్లాస్థాయిలోనూ ప్రభుత్వం మా సిబ్బందికి అవార్డులు ఇచ్చింది. ప్రభుత్వ పథకాలు సక్రమంగా అమలు చేసినందుకు మహిళలకు డబ్బులు ఇచ్చి తిరిగి సిబ్బంది వసూలు చేశారు.

అదుపుతప్పిన కారు

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కడప-తాడిపత్రి ప్రధాన రహదారి వద్ద మంగళవారం తెల్లవారుజామున కారు అదుపుతప్పి కిందపడింది. మండలంలోని ఓబన్నపేట గ్రామం వద్ద తాడిపత్రి వైపు వెళుతన్న కారు బైపాస్‌రోడ్డు నుంచి అదుపుతప్పి కిందపడింది. అదృష్టవశాత్తు అందులో ప్రయాణిస్తున్న వారు ప్రమాదం నుంచి బయటపడ్డారు. కాగా కారు ముందు భాగం దెబ్బతింది. ప్రస్తుతం నేషనల్‌హైవే పనులు జరుగుతుండగా ఇంకా డివైడర్లు వేయలేదు. దీంతో మలుపులో కారు అదుపుతప్పి కిందపడినట్లు తెలుస్తోంది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

ఘనంగా ముక్తిరామలింగేశ్వరస్వామి గ్రామోత్సవం





గ్రామోత్సవంలో గంగాగౌరీ సమేత ముక్తిరామలింగేశ్వరస్వామి, ఆకట్టుకున్న మహిళల కోలాటం

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రామేశ్వరంలో తిరుణాళ్ల, కార్తీక మాసం సందర్భంగా ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం అర్ధరాత్రి గంగాగౌరీసమేత ముక్తిరామలింగేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వాహనంపై కొలువుదీర్చారు. అనంతరం పురవీధుల్లో శివనామస్మరణతో స్వామివారిని ఊరేగించారు. డప్పు వాయిద్యాలు, మహిళల కోలాటం, బాణసంచా పేలుళ్లతో గ్రామోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని కాయాకర్పూరం సమర్పించి భక్తిశ్రద్ధలతో మొక్కుకున్నారు.

బాలికలు అన్ని రంగాలలో రాణించాలి : ఎంపీడీవో

ఎర్రగుంట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీడీవో వెంకటరమణయ్య తెలిపారు. మంగళవారం ఎంపీడీవో సభా భవనంలో ఏర్పాటు చేసిన జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచారం అనే కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పనిచేసే గ్రామాల్లో పెద్దఎత్తున ప్రచారం నిర్వహించి బాలికలకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో వెలుగు ఏపీఎం జగదీశ్వరి, మహిళా పోలీసులు, ఎంఈవో శివప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపాలి



నిరసన తెలుపుతున్న దృశ్యం

బద్వేలు , నవంబరు26 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ఆపడంతో పాటు ఉద్యోగ, ఉపాధ్యాయ వ్యతిరేక విధానాలు విడనాడాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి నాగేష్ పేర్కొన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర నాయకులు నాగేంద్రబాబు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

లావనూరులో టాస్క్‌ఫోర్స్ టీమ్ తనిఖీ

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి):మాతా శిశు మరణాలపై జిల్లా టాస్క్‌ఫోర్స్ టీమ్ లావనూరు గ్రామంలో తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సిబ్బంది చేసిన సర్వే పై తనిఖీ నిర్వహించారు. నివేదికలను పరిశీలించారు. సిబ్బందికి తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు,నాగభూషణ్, రమేష్‌రెడ్డి, నారాయణ,అరుణ,డాక్టర్లు సాంబశివారెడ్డి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు

దువ్వూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 90 శాతం సబ్సిడీతో డ్రిప్ పరికరాలు అందుబాటులో ఉన్నట్లు ఏవో అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. 50 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. దువ్వూరు మండలం, నీలాపురం, దాసరిపల్లె గ్రామాల్లో మంగళవారం రైతులతో కలిసి ఆయన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మొక్కజొన్న, ఉల్లి పంటల విషయంలో తెగుళ్లపట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు.

కూటమి ప్రభుత్వంలోనే దివ్యాంగుల సంక్షేమం

ప్రొద్దుటూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంలోనే దివ్యాంగుల సంక్షేమ ఫలాలు అందుతున్నాయని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం అనిబిసెంట్‌మున్సిపల్ హైస్కూలు ఆవరణలో సామాజిక సాధికారత సమితి ఆధ్వర్యంలో 35 రకాల ఉపకరణాలు 650 మంది దివ్యాంగులకు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి చేతుల మీదుగా ఉచితంగా వాహనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయిశ్రీ, డీఈవో మీనాక్షి, తహసీల్దారు గంగయ్య, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున, ఏడీ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పంటల బీమా కోసం ప్రీమియం చెల్లించండి : ఏడీఏ

బి.కోడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రతి రైతు పంటకు బీమా కోసం ప్రీమియం చెల్లించాలని వ్యవసాయ ఏడీఏ మురళీధర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తంగేడుపల్లె రైతు సేవా కేంద్రంలో రబీ పంటల బీమా (ప్రధానమంత్రి ఫసల్‌బీమా యోజన)పై రైతులకు అవగాహన సదస్సు ఏవో కౌశిక అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సభకు హాజరైన ఏడీఏ మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ మన జిల్లాలో 8 రకాల వ్యవసాయ పంటలకు బీమా కోసం ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎకరాకు వరికి రూ.630, శనగ, వేరుశనగకు రూ.480, జొన్నలకు రూ.315, ప్రొద్దుతిరుగుడుకు రూ.300, మినుములకు రూ.270 పెసలు, నువ్వులకు రూ.180 చొప్పున ప్రీమియం చెల్లించాలన్నారు. వరి పంటకు డిసెంబరు 31లోపు మిగతా పంటలకు డిసెంబరు 15లోపు రైతులు ప్రీమియం చెల్లించాలని వారు తెలిపారు. రైతులతో కలిసి పంటల బీమా గోడపత్రాలను కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రైతుభరోసా వ్యవసాయ అసిస్టెంట్లు బ్రహ్మానందరెడ్డి, ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి తరుణ్, రైతులు పాల్గొన్నారు.

రూ.కోటి 60 లక్షల వ్యయంతో సిమెంటురోడ్లు

కొండాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో సుమారు రూ.కోటి 60 లక్షల రూపాయిల వ్యయంతో సిమెంటురోడ్ల నిర్మాణం జరుగుతున్నట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. ఎంపీపీ లక్ష్మీదేవి అధ్యక్షతన మంగళవారం కొండాపురం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. అదేవిధంగా డిశంబరు 2 వతేది నుంచి కొత్తగా సామాజిక పెన్షన్లకు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు. వచ్చే నెల 15 లోపు పంటబీమాకు సీఎస్సీ సెంటర్ల ద్వారా రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. మండలంలో కొత్తగా 19 అంగన్‌వాడీసెంటర్లకు భవనాలు మంజూరయ్యాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి తెలిపారు. మహిళలు తాము తయారుచేసే ఉత్పత్తులను ప్రభుత్వం నిర్వహించే ఓఎన్‌డీసీ ఈ-కామర్స్ వెబ్‌సైట్ ద్వారా అమ్ముకోవచ్చని వెలుగు ఏపీఎం ఓబులేసు తెలిపారు. ఈ కార్యక్రమంలో చామలూరు సర్పంచ్ రాఘవేంద్రారెడ్డి, కోడూరు ఎంపీటీసీ రామమునిరెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు

ప్రొద్దుటూరు , నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : దోమల నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ మల్లికార్జున తెలిపారు. మంగళవారం కొత్తపల్లె చానల్ రామేశ్వరం అగ్రహారం నుంచి సినీహబ్ వరకు కాలువ మొత్తం స్ప్రెయింగ్ పనులను కమిషనర్ ప్రారంభించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నూర్‌బాషా, సుబ్బరాయుడు గోవిందరెడ్డి, సునీత పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

కాశినాయన నవంబరు26(ఆంధ్రజ్యోతి): చిత్తా శౌరిరెడ్డి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ ఫర్ చిల్డ్రన్ ఇన్ నీడ్ సహకారంతో కొండ్రాజుపల్లె, గంగనపల్లె,చెన్నారెడ్డిపల్లె,అక్కులరెడ్డి గ్రామాల్లోని ఆర్‌సీఎం ప్రాథమిక పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఆసంస్థ ప్రతినిధులు ఎల్.ప్రసాద్‌రెడ్డి,జి.శ్రీకాంత్‌రెడ్డి ఉచితంగా దుస్తులు అందజేశారు.ఈసందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ విద్యార్థులు క్రిస్మస్ ,నూతన సంవత్సరం పండుగలు సంతోషంగా జరుపుకోవాలని వారికి ప్రోత్సాహకంగా దుస్తులుఅందజేశామన్నారు.ఈకార్యక్రమంలోహెచ్‌ఎం జి.జోజయ్య,బి.భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

29న జాబ్‌మేళా

జమ్మలమడుగు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 29వ తేదీ జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణాభివృద్ధి సంస్థ అధికారి విజయవినయ్‌కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ కె.సురేంద్రనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మలమడుగులోని ముద్దనూరు రోడ్డులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాకు ప్రముఖ కంపెనీలు వస్తాయన్నారు. 10వ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ చదువుకున్నవారు తమ బయోడేటాతోపాటు సర్టిఫికెట్లను జాబ్‌మేళావద్దకు తీసుకుని రావాలని కోరారు. 90004 79991 నంబరుకు సంప్రదించాలన్నారు.

పోరుమామిళ్ల..: జాబ్‌మేళాను సద్వినియోగంచేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డేవిడ్ రాజ్ తెలిపారు. ఈ నెల 29న ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖ కంపెనీల ప్రతినిధులు వస్తారని, ఇంటర్, డిగ్రీ, పీజీ ఫార్మశీ బీటెక్ చదివిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 70135 04977లను సంప్రదించాలన్నారు.

అమ్మవారిశాలలో దీపాలంకరణ

ఎర్రగుంట్ల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మెయిన్‌బజార్‌లో అమ్మవారిశాలలో కార్తీక ఏకాదశిని పురస్కరించుకుని సహస్ర దీపాలంకరణ నిర్వహించారు. మహిళా మండలి ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహించి అనంతరం సహస్ర దీపాలంకరణ చేశారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న 104 ఉద్యోగులు

ప్రొద్దుటూరు టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): 104 ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేయాలని మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ 104 ఎంఎంయూ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు మహ్మద్‌అలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగేంద్రబాబు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించాలని గత ప్రభుత్వం దృష్టికి ఎన్నిసార్లు చెప్పినా నిర్లక్ష్యం ప్రదర్శించిందన్నారు. 104 సర్వీసులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుద్వారా నిర్వహించి తమకు ప్రతినెలా సక్రమంగా వేతనాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 104 ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిధులు దుర్వినియోగం

డ్రైనేజీ నిర్మాణాలు ధ్వంసం



కూల్చివేసిన డ్రైనేజీ కాలువలు

బద్వేలుటౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని 10వ వార్డు ఆంజనేయనగర్‌లో మున్సిపల్ చైర్మన్ వాకమల్ల రాజగోపాల్‌రెడ్డి ఇంటి వెనుకభాగం డ్రైనేజీ కాలువను సుమారు 20మీటర్లు మున్సిపల్ అధికారులు పగులకొట్టారు. గతంలో లక్షల రూపాయలు ఖర్చుచేసి డ్రైనేజీ నిర్మాణాలను ఏర్పాటు చేస్తే, కొందరు అధికారులు స్వార్థం కోసం డ్రైనేజీ కాలువలను పగులకొట్టడం విడ్డూరంగా ఉంది. డ్రైనేజీకాలువలను ఎవరో స్వలాభం కోసం పగులకొట్టారన్నది తెలియాల్సి ఉంది. మున్సిపాలిటీలో డ్రైనేజీ నిర్మాణాలు, సీసీరోడ్లు చేపట్టడం గగనంగా ఉంటే, ఉన్నవాటిని కూడా పగులకొట్టడం ఏమిటా అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీలో కొన్ని వార్డుల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువలు లేక మురుగునీరంతా రోడ్లపై ప్రవహిస్తూ ప్రజలు లబోదిబోమంటుంటే ఉన్నవాటిని కూడా కూల్చివేయడం ఏమిటని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించాలని ప్రయత్నించగా ఆయన అందుబాటులో లేరు.

వేరుకుళ్లు తెగులుతో ప్రమాదం



ముద్దనూరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ముద్దనూరు నవంబరు26(ఆంధ్రజ్యోతి):శనగ పంటలో వేరుకుళ్ల తెగులు ఆశించే ప్రమాదం ఉందని తగు జాగ్రత్తలు పాటించాలని కేవీకే సేద్య విభాగం శాస్త్రవేత్త సాయి మహేశ్వరి రైతులకు సూచించారు. మండల పరిధి వేల్పుచర్ల,పెద్దదుద్యాల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ వెంకటసుబ్బయ్య, ఏవో వెంకటకృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొండాపురం..: తెగులు నివారణకు చర్యలు చేపట్టినట్లు కృషి విజ్ఞాన శాస్త్రవేత్త సాయిమహేశ్వరి తెలిపారు. మండలంలోని రేగడిపల్లె గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. శనగపంటలో అక్కడక్కడ బంతిపూలు సాగుచేసినట్లయితే పచ్చపురుగు ఉధృతిని నివారించవచ్చునని ఆమె తెలిపారు. పంటమార్పిడి విధానం ద్వారా తగిన దిగుబడి సాధించవచ్చునని ఏవో రామాంజులరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి , బాలనాగేశ్వరరెడ్డి, వీఏఏ కరీమున్, రైతులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ప్రొద్దుటూరు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండల సర్వసభ్య సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సూర్యనారాయణరెడ్డి తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సభాభవనంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందన్నారు. మండల పరిధిలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

ఆర్థిక విషయాల పట్ల జాగ్రత్తగా ఉండాలి

బద్వేలు , నవంబరు26 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక విషయాలలో ఎప్పుడూ జాగ్రత్తగా ఉండాలని బద్వేలు యాక్సిస్ బ్యాంక్ మేనేజ్ బి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని బ్యాంక్‌లో ఆర్థిక విషయాల మోసాల పట్ల జాగ్రత్త వహించాలని ఖాతాదారులకు సూచించారు. చాలామంది ఏటీఎంల వద్ద మీరు క్యాష్ ఇవ్వండని మేం డబ్బులు ఫోన్ పే చేస్తామనో, లేదా మా దగ్గర ఉన్న స్కానర్‌కు ఫోన్ పే చేయండి మీకు డబ్బులు ఇస్తామనో ఇలా పలు రకాలుగా మోసగిస్తారన్నారు. మీకు ఎలాంటి బ్యాంక్ సమస్యలున్నా నేరుగా బ్యాంక్‌లోని సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ సిబ్బంది సురేంద్ర ,శ్రీకాంత్, ప్రేమ్ చంద్, చంద్ర ,ఖాతాదారులు పాల్గొన్నారు.

ఆరోగ్యం, పోషణ, రక్షణే కిశోరి వికాస్ ఉద్దేశ్యం

బద్వేలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 11 నుంచి 18సంవత్సరాల వయస్సు ఉన్నవారికి ఆరోగ్యం, పోషణ, రక్షణ వంటి విషయాలపై అవగాహన కల్పించాలన్న ఉద్దేశ్యంతోనే కిశోరి వికాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో మల్లీశ్వరి తెలిపారు. కిశోరి వికాస్ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బాల్యవివాహాలపై ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.